Published by Telangana
TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9398191920.

సంపుటి : 01 సంచిక : 142 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ శనివారం 31-05-2025 పేజీలు :12 వెల :2/-

# డఫోడిల్స్ హై స్కూల్, సంగారెడ్డి







గత 20 ఏళ్లుగా మీ అందరి సహాయ సహకారాలతో, తరగతిలో మితమైన విద్యార్థులతో, అనుభవం & అంకిత భావం కలిగిన ఉపాధ్యాయ బృందం నాణ్యమైన విద్యనందిస్తూ, మీ అందరి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నా డాఫడిల్స్ పాఠశాల యాజమాన్యం ఎప్పటిలాగే ఈసారి కూడా 100% ఉత్తీర్ణతతో తన విజయ కేతనాన్ని ఎగరవేస్తూనే ఉంది. డఫోడీల్స్ అంటే ది ప్లేస్ ఆఫ్ క్రియేటివిటీ అని నమ్మి, పిల్లలందరినీ సొంత పిల్లలుగా రాత్రింబవళ్ళు వారి శారీరక, మానసిక ప్రగతి కోసం పాటు పడే డఫ్ఫోడిల్స్ కరస్పాండెంట్ ఎన్. చందనలత ఎం ఏ బి ఈ డి,ఈ మధ్య 2024-25 విద్యా సంవత్సరంలో విజయం సాధించిన ప్రతి ఒక్క విద్యార్థికి హృదయ పూర్వక అభినందనలు తెలియ జేస్తూ, వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు.

**మా డాఫడిల్స్ ఆణిముత్యాలు**

1. డి. చరణ్ తేజ 553/600
2. ఏ. విశ్వాస్ కుమార్ 552/600
3. టి. శాంతి సుధ 549/600
4. అర్ఫా ఖనన్ 546/600
5. ఎం. పూర్ణిమ 542/600
6. శ్రీయ పాండే 542/600
7. ఎండి. ముజాహిద్ 541/600
8. బి. కార్తీక్ 539/600
9. సిచ్. ఐసాక్ 536/600
10. వై. శంకర్ 531/600
11. కె. వికాస్ గౌడ్ 531/600
12. ఎం. మేఘన 525/600
13. ఎల్. అలేఖ్య 522/600
14. ఇ. నిఖిల్ 515/600
15. కె వర్ష 504/600
16. సయ్యాద్ అయాన్ 503/600
17. ఎం. సర్జన్ 501/600
18. పి. లోకేంద్రన్ 493/600
19. జి. ప్రియాంక 492/600
20. అబ్దుల్ రహమాన్ 490/600
21. కె. లోకేష్ గౌడ్ 480/600
22. ఎం. రమ్య 478/600
23. ఖుషి 464/600
24. రిజ్వాన్ బేగ్ 452/600
25. సిచ్. షారోన్ రోజ్ 451/600
26. సయ్యాద్ ముజ్జామిల్ 414/600
27. ఎండి. మహమ్మద్ రెహాన్ 414/600
28. బి. కార్తీక్ 370/600
29. ఎండి. అద్నాన్ 359/600

Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

**విలేకరులు కావలెను**


తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సావంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9398191920.

సంపుటి : 01 సంచిక : 142 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ శనివారం 31-05-2025 పేజీలు :12 వెల :2/-

# ఉగ్రమూకను మట్టిలో కలిపేశాం

## - ప్రధాని మోడీ

**పాట్నా :** పహల్గాం దారుణానికి ప్రతీకారంగా ఉగ్రశిబిరాలను ధ్వంసం చేస్తానని గత పర్యటనలో హామీ ఇచ్చానని, దానిని నెరవేర్చాకే ఇప్పుడు తిరిగి బీహార్ వచ్చినట్టు ప్రధాని మోడీ తెలిపారు. నాడు ఉగ్రవాదులను ఊహించని విధంగా శిక్షిస్తానని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. శుక్రవారం ఆ రాష్ట్రంలోని కరకట్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని ప్రసంగించారు. " రాముడి బాటలో ఒక్కసారి వాగ్దానం చేస్తే దానిని నెరవేర్చి తీరుతాం. ఇదే సరికొత్త భారత్ విధానం. పహల్గాంలో ఉగ్రదాడి జరిగింది. మన అమాయక ప్రజలు హత్యకు గురయ్యారు. ఒకరోజు తర్వాత నేను బీహార్( ఏప్రిల్ 24న ) పర్యటనకు వచ్చాను. పాక్ లోని ఉగ్రవాదుల ప్రధాన కార్యాలయాలను ధ్వంసం చేస్తానని, ఈ గడ్డపై నుంచి దేశానికి హామీ ఇచ్చాను. నా వాగ్దానాన్ని నెరవేర్చాకే ఇప్పుడు బీహార్‌లో అడుగుపెట్టాను.



2



# నావికా దళం రంగంలోకి దిగితే పాక్ సర్వనాశనం అయ్యేది

## - రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్

**ముంబయి :** ముంబయి – పాకిస్థాన్‌తో యుద్ధం జరిగినపుడు భారత నేవీ గనుక రంగలోకి దిగి ఉంటే.. పాకిస్థాన్ నాలుగు ముక్కలయి ఉండేదని అన్నారు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. యుద్ధం సమయంలో భారత నేవీ మౌనంగా ఉంటూనే.. శత్రువుల గుండెల్లో దడ పుట్టించిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా నేవీ పాత్రను ఆయన కొనియాడారు. ఐఎన్ఎస్ విక్రాంత్‌ను నేడు ఆయన సందర్శించారు. అందులోని సిబ్బందితో ఆయన మాట్లాడారు.. ఆపరేషన్ సిందూర్ లో వారు చేసిన సేవలను ప్రశంసించారు. అనతరం ఆయన ఐఎన్ఎస్ విక్రాంత్‌పై నిలబడి మాట్లాడుతూ.. ' 1971లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం జరిగినపుడు భారత నేవీ కూడా యుద్ధంలో పాల్గొంది. భారత నేవీ దెబ్బకు పాక్ రెండుగా చీలిపోయింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నేవీ రంగంలోకి దిగి ఉంటే.. ఈ సారి పాక్ నాలుగు ముక్కలు అయ్యేది. ఆపరేషన్ సిందూర్ సమయంలో నేవీ మౌనంగా తన పని చేసుకుపోయింది. ప్రతీ భారతీయుడ్ని ఆశ్చర్యపరిచింది. మౌనంగా ఉంటూనే.. పాక్ ఆర్మీని ఓడించటంలో విజయవంతం అయింది. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఎయిర్‌ఫోర్స్

మిగితా 2లో

# రూ. 3 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత... ఒకరి అరెస్ట్



**హైదరాబాద్:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీగా హెరాయిన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ. 3 కోట్ల విలువ చేసే కేజీన్నర హెరాయిన్‌ను స్వాధీనం చేసుకోగా, రాజస్థాన్ రాష్ట్రంలోని నాగ్‌పూర్‌కు చెందిన వికాస్ సాహు అనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుడి నుంచి హెరాయిన్‌తో పాటు ఓపీఎం, పోపీ స్ట్రా, డ్రై గాంజాను స్వాధీనం చేసుకున్నట్లు

మిగితా 2లో

# ఆరు శాసనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి : చంద్రబాబు

**న్యూఢిల్లీ :** మహానాడులో ప్రవేశపెట్టిన 'నా తెలుగు కుంటుంబం'లోని ఆరు శాసనాల కాన్సెప్ట్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు టీడీపీ అధినేత చంద్రబాబు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తున్నామన్నారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా నిర్ణయాలపై ప్రజల్లో సానుకూలత ఉందని తెలిపారు. ప్రజలకు ఏడాది పాలనలో ఏం చేశామో రాబోయే రోజుల్లో ఏం చేస్తామో మహానాడు ద్వారా వివరించామన్నారు. ప్రజలతో నాయకులు మరింత మమేకమవ్వడం ద్వారా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై నిరంతరం చర్చించేలా చూడాలని సూచనలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన నేడు పార్టీ ముఖ్య నేతలతో, కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కడప మహానాడు అద్భుతంగా జరిగిందని.. జిల్లా నాయకత్వమంతా కలిసి పనిచేసి విజయవంతం చేశారన్నారు. సక్సెస్ చేసిన నేతలకు అభినందనలు, కార్యకర్తలకు హ్యాట్సాఫ్ తెలిపారు సీఎం. నాయకత్వం సమిష్టిగా పనిచేస్తే ఏ కార్యక్రమమైనా సజావుగా జరుగుతుందని కడప మహానాడుతో నిరూపితమైం దన్నారు. మంత్రులంతా

మిగితా 2లో





# నైజీరియాలో వరదలకు మార్కెట్‌టౌన్ మునిగి 111 మంది మృతి

**నైజీరియా :** నైజీరియాలోని నైజెర్ రాష్ట్రంలో మార్కెట్ టౌన్ మోక్వాలో వరదలు ముంచెత్తి 111 మంది ప్రాణాలు కోల్పోయారు. నైజెర్ రాష్ట్ర రాజధాని మిన్నాలో ఆపరేషన్స్ ఆఫీస్ హెడ్ హుస్సేన్ ఇసా వరద ముప్పులో ఇంకా అనేక మంది చిక్కుకున్నారని వారిని రక్షించే చర్యలు చేపట్టామని తెలిపారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. గత కొన్ని గంటలుగా ఎడతెరిపిలేని వానలు కురియంతో వరదలు ముంచుకొచ్చాయి. సమీపాన గల ఆనకట్ట కూలిపోవడంతో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. దక్షిణాది వ్యాపారస్తులకు, ఉత్తరాది రైతులకు మోక్వా నగరం కేంద్రంగా ఉంటోంది. గత సెప్టెంబరులో నైజీరియా ఈశాన్య ప్రాంతం మైదుగురిలో కుంభవృష్టి కారణంగానే సమీపాన ఆనకట్ట కూలిపోయి 30 మంది మృతి చెందారు. కొన్ని వేల మంది నిర్వాసితులయ్యారు.

# తనకు జెండా.. ప్రత్యేక అజెండా లేనేలేదు - స్పష్టం చేసిన కవిత



**మంచిర్యాల :** బీఆర్ఎస్ పార్టీని కాపాడుకోవాలనేదే నా తపన.. ఆరాటం తప్పితే ఇంకేం లేదన్నారు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. పార్టీని బీజేపీలో విలీనం చేయొద్దంటూ పార్టీ అధినేత, తండ్రి కేసీఆర్ ను ఉద్దేశించి స్పష్టం చేశారామె. మంచిర్యాల పర్యటనలో ఉన్న ఆమె నేడు మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. డాడీ కేసీఆర్ ను కలిసే అవకాశం వచ్చినా.. కలవలేకపోయాను అంటూ ఆవేదన వ్యక్తం చేశారామె. లిక్కర్ స్కాంలో తాను జైల్లో ఉన్నప్పుడు బీజేపీలో బీఆర్ఎస్ పార్టీని కలుపుతామని తనకు చెప్పారని.. విలీనానికి అస్సలు ఒప్పుకోలేదంటూ అప్పటి సంఘటనను గుర్తు చేసుకున్నారు కవిత. బీజేపీ పార్టీతో పొత్తు పెట్టుకున్న

మిగితా 2లో




# రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు

**హైదరాబాద్ :** రాష్ట్రంలో మూడు రోజుల పాటు ఈదురు గాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. శనివారం ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి,

మిగితా 2లో

# ఇప్పట్లో పాక్ కోలుకోవడం కష్టమే

## - అమిత్ షా



**హైదరాబాద్ :** ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ లోని 118 పోస్టులను, వారి సమాచార నిఘా నెట్‌వర్క్‌ను భారత సరిహద్దు భద్రతా దళాలు పూర్తిగా ధ్వంసం చేశాయని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా శుక్రవారం ప్రశంసలు కురిపించారు. బీఎస్ఎఫ్ కొట్టిన దెబ్బకు శత్రుదేశం కోలుకునేందుకు ఏళ్లు పట్టే అవకాశం ఉందన్నారు. " ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దులోని పౌరులపై దాడులు చేసింది. వీటిని మన బీఎస్ఎఫ్ దళాలు

మిగితా 2లో

# ఉగ్రమూకను మట్టిలో కలిపేశాం ప్రధాని మోడీ

పాకిస్థాన్ మన మహిళల సిందూరం శక్తిని చవిచూసింది. పాక్ ఆర్మీ నీడలో తాము సురక్షితంగా ఉంటామని ఉగ్రవాదులు భావించారు. మనం ఆ దేశ సైన్యాన్ని మోకాళ్లపై కూర్చోబెట్టాం. మనం వారి ఎయిర్‌బేస్‌లను మిలిటరీ స్థావరాలను నిమిషాల్లోనే ధ్వంసం చేశాం. ఆపరేషన్ సిందూర్ మన అమ్ముల పొదిలో కేవలం ఒక బాణం మాత్రమే అని పాక్ తెలుసుకోవాలి. ఉగ్రవాదంపై మన యుద్ధం ముగియలేదు. నెమ్మదించలేదు. మరోసారి ఉగ్రదాడి జరిగితే, ఈ సారి ఆ పాము తలే ధ్వంసం అవుతుంది " అని ప్రధాని మోడీ వెల్లడించారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోడీ బీహార్‌లో పర్యటిస్తున్నారు. ఆయన నిన్న పట్నాలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశం వెనక్కి తగ్గదు, బీహార్‌లో అభివృద్ధి ఆగదు అని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది బీహార్‌అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి.

ఆపరేషన్ సిందూర్ సమయంలో బిఎస్ఎఫ్ శౌర్యం, ధైర్యాన్ని ప్రపంచం చూసిందని ప్రధాని మోడీ చెప్పారు. మాతృభూమికి సేవ చేయడమనే పవిత్ర కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, ఈ నెల 10న సరిహద్దులో బీఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్ తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు. ఈ బిహార్ కుమారునికి గౌరవపూర్వక నివాళి అర్పిస్తున్నానన్నారు. బిహార్ లో ఇవాళ పర్యటించిన ఆయన ఈ సందర్భంగా కరకట్‌లో ప్రధాని రూ.48,520 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఎన్ హెచ్-22లోని పట్నా-గయా-దోభి సెక్షన్‌ను నాలుగు లేన్లుగా మార్చడం, ఎన్ హెచ్-27లోని గోపాల్‌గంజ్ టౌన్‌లో దాదాపు రూ.5,520 కోట్ల విలువైన ఎలివేటెడ్ హైవే.. గ్రేడ్ మెరుగుదలను మోడీ ప్రారంభించారు. వీటితో పాటు, సోన్ నగర్- మహ్మద్ గంజ్ మధ్య రూ.1,330 కోట్లతో నిర్మించిన మూడో రైలు మార్గాన్ని జాతికి అంకితం చేశారు.

ఇంకా తూర్పు భారతదేశానికి ఇంధన భద్రతను చేకూర్చే లక్ష్యంతో ఔరంగాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన రూ.29,930 కోట్లకు పైగా విలువైన నబీనగర్ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ స్టేజ్-(3ఐ800 వీఔ)కు కూడా ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు.

అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. పాకిస్థాన్ సహా మొత్తం ప్రపంచం భారతదేశ కుమార్తెల సిందూర శక్తిని చూశాయన్నారు. ఇది మన అంబులపొదిలో ఉన్న ఒక బాణం మాత్రమే అని వారు అర్థం చేసుకోవాలన్నారు. ఉగ్రవాదంపై భారతదేశం చేస్తున్న పోరాటం ఆగలేదని, ఉగ్రవాదం మళ్లీ తలెత్తితే, అది ఏ కలుగులో దాక్కున్నా.. భారతదేశం బయటకు లాగి అణచివేస్తుందని తేల్చి చెప్పారు.

**మావోయిస్ట్ చరిత్ర ఇక గతమే ..**

గడిచిన సంవత్సరాల్లో హింస, అశాంతిని వ్యాప్తి చేసే వారిని మనం ఎలా నిర్మూలించామన్న దానికి బిహార్ ప్రజలే ప్రత్యక్ష సాక్షులని ప్రధాని మోడీ అన్నారు. 'కొన్నేళ్ల క్రితం ససారాం, దాని సమీప జిల్లాల్లో నక్సలిజం ఎంత ప్రబలంగా ఉండేదన్న విషయాన్ని మోదీ తన ప్రసంగంలో ప్రస్తావించారు.

మావోలకు బాబాసాహెబ్ అంబేద్కర్‌పై నమ్మకం లేదన్నారు. అటువంటి సంక్లిష్ట పరిస్థితులలో కూడా, సీఎం నితీష్ కుమార్ ఇక్కడ అభివృద్ధి కోసం తన వంతు ప్రయత్నం చేశారని ప్రశంసించారు. 2014కి ముందు 75కి పైగా జిల్లాలు నక్సల్ ప్రభావితమైనవి. ఇప్పుడు వాటి సంఖ్య కేవలం 18 జిల్లాలకు మాత్రమే పరిమితమైంది. మావోయిస్టు హింస పూర్తిగా నిర్మూలించబడే రోజు ఎంతో దూరంలో లేదు" అని మోడీ అన్నారు.

# రూ. 3 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత... ఒకరి అరెస్ట్

నేడు జరిగిన మీడియా సమావేశంలో సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తెలిపారు. సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తెలిపిన వివరాలు ప్రకారం, మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ నుంచి డ్రగ్స్ తెస్తున్నట్లు గుర్తించారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితులు ధూల్‌పేటకు చెందిన సలీం, జల్పల్లికి చెందిన రాజు, మధ్యప్రదేశ్ కు చెందిన గణపత్‌లుగా గుర్తించారు. వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. షాద్‌నగర్‌లోని సంజుభాయ్ మార్వాడి దాబాలో డ్రగ్స్ విక్రయిస్తున్న వికాస్ సాహుతో పాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గతంలో దాబా యజమాని సంజుభాయ్ తో కలిసి వికాస్ గంజాయి విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల అతడు మరణించడంతో దాబాను వికాస్ సాహు నిర్వహిస్తున్నాడు. దాబాకు వచ్చే వారికి కూడా డ్రగ్స్ విక్రయించినట్లు విచారణలో తేలినట్లు చెప్పారు. శంషాబాద్‌లోని రాయికల్ టోల్‌గేట్ వద్ద భారీగా హెరాయిన్ డ్రగ్స్ పట్టుకున్నాం. షాద్‌నగర్‌లోని సంజుభాయ్ మార్వాడి దాబాలో డ్రగ్స్ విక్రయిస్తున్న సమాచారం రావడంతో అక్కడ నిఘా పెట్టాం. హెరాయిన్‌తోపాటు గంజాయి, ఓపీఎం డ్రగ్స్ సీజ్ చేశాం. దాబాలో పనిచేసే వంట మనిషి వికాస్ సాహు రాజస్థాన్ నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి అతడికి తెలిసిన కస్టమర్స్‌కు విక్రయిస్తున్నాడు. రూ. 3 కోట్ల విలువ చేసే హెరాయిన్ అతడి వద్ద పట్టుకున్నాం. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓపీఎం, డ్రగ్స్ తెస్తున్నారు. బస్సు ద్వారా డ్రగ్స్ రవాణా చేస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. డ్రగ్స్ విక్రయంలో ప్రమేయం ఉన్న మరో ముగ్గురి పేర్లను వికాస్ సాహూ విచారణలో తెలిపాడు. సలీం, రాజు, గణపత్ అనే ఈ ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారు. త్వరలోనే పట్టుకుంటాం."

**– అవినాష్ మహంతి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్**

# ఆరు శాసనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి : చంద్రబాబు

కార్యకర్తల్లా పనిచేసి స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. మహానాడుకు ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రావడం సంతోషాన్నిచ్చింది. కాగా, తాను ప్రతి నెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన దానికి కారణం ప్రజలతో మమేకం కావాలని నిర్ణయించుకోవడమేనని అన్నారు చంద్రబాబు. ఎమ్మెల్యేలు కూడా విధిగా పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. జూన్ నెలలోనే తల్లికి వందనం, అన్నదాత పథకాలు ప్రారంభిస్తామని ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందేలా సంక్షేమ కేలండర్‌ను త్వరలోనే ప్రకటిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

**రేపు కోనసీమ జిల్లాలో పర్యటన..**

మరోవైపు కోనసీమ జిల్లాలో రేపు సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం 12:50 గంటలకు ముమ్మిడివరం మండలం సి.హెచ్.గున్నేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో సీఎం దిగనున్నారు. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1:05 గంటలకు కాట్రేనికోన మండలం చెయ్యారులో ఉపాధి హామీ పథకంలో పూడికతీత తీసే ఉపాధి కూలీలతో మాటామంతి నిర్వహిస్తారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు అర్హులకు పింఛన్ పంపిణీ చేయనున్నారు.

అదే గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్తులతో సమావేశం కానున్నారు ముఖ్యమంత్రి.

అక్కడే జిల్లాకు సంబంధించి పేదల సేవలో – బంగారు కుటుంబ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం సీహెచ్ గున్నేపల్లి గ్రామంలో 3:35 గంటలకు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశంలో పాల్గొననున్నారు. 5:15 గంటలకు గున్నేపల్లి హెలిప్యాడ్ నుంచి తిరిగి ప్రయాణం కానున్నారు. జిల్లాలో సుమారు ఐదు గంటల పాటు సీఎం పర్యటన జరగనుంది.

# సంతకాలు సరే.. ఆయుధాలు రావు

### రక్షణ ఒప్పందాలపై వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్ అసంతృప్తి

### రక్షణ మంత్రి సమక్షంలోనే వ్యాఖ్యలు

### సకాలంలో పూర్తయిన ప్రాజెక్టు ఒక్కటీ లేదని తీవ్ర విమర్శ తేజస్ ఎంకె2 ఇంకా అందలేదని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** రక్షణ రంగంలోని ప్రధాన కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి కానీ, డెలివరీలు మాత్రం మొదలు కావని వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఐఐ వార్షిక సమావేశం లో ఆయన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌స మక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేశారు. " చాలా సా ర్లు కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి. కానీ సిస్టమ్స్ (ఆయుధాలు) మాత్రం ఎప్పటికీ అందవు. టైమ్‌లైన్ ప్రధాన సమస్య. సకాలం లో పూర్తయిన ఒక్క ప్రాజెక్టు కూడా నాకు గు ర్తుకు రావడం లేదు. మనం చేయలేని పనికి ఎందుకు వాగ్దానాలు చేయడం? తేజస్ ఎంకే 1 చాలా ఆలస్యమైంది. ఇక తేజస్ ఎంకే 2 ఫోటోటైప్ కూడా అందుబాటు లోకి రాలేదు. ఇక ఆమ్కా ఫైటర్‌కు సంబంధించి ఇప్పటివరకు నమూనా విమానం కూడా రాలేదు. మన దళాలు, పరిశ్రమ మధ్య విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉంది. పారదర్శకత చాలా అవస రం.మనం ఒక్కసారి దేనికైనా కట్టుబడితే దాని అందించి తీరాల్సిందే. మేకిన్ ఇండియా కో సం వాయుసేన శక్తివంచన లేకుండా కృషి చే స్తోంది. మనం ఈరోజు సంసిద్ధంగా ఉంటేనే, భవిష్యత్తుకు సన్నద్ధం కాగలం. రానున్న పదేళ్లలో మన పరిశ్రమలు ఉత్పత్తిని గణనీయంగా పెంచగలవు. కానీ ప్రస్తుతానికి మనం త్వరగా చర్యలు తీసుకోవడం అవసరం. దళాలను శక్తిమంతం చేసుకుంటేనే యుద్ధాలు గెలుస్తాం" అని పేర్కొన్నారు.

**యుద్ధం రంగం వేగంగా మారిపోతోంది..!**

యుద్ధ రంగంలో వేగంగా మారిపోతున్న సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ సూచించారు. " మన నౌకాదళాధిపతి చెప్పినట్టు యుద్ధరంగం వేగంగా మారిపోతోంది. ప్రతిరోజూ సరికొత్త టెక్నాలజీలు అందుబాటు లోకి వస్తున్నట్టు చూస్తున్నాం. ఆపరేషన్ సిందూర్‌తో మనం ఎక్కడ ఉన్నాం. భవిష్యత్తుకు ఏం కావాలనే దానిపై స్పష్టమైన అవగాహన వచ్చింది.మనం చేయాల్సింది చాలా ఉంది. ఆమ్కా ప్రాజెక్టును ప్రైవేట్ సెక్టార్ కోసం కూడా క్లియర్ చేశారు. ఇది చాలా పెద్ద నిర్ణయం. మన ప్రైవేట్ రంగంపై దేశానికి ఆ స్థాయిలో విశ్వాసం ఉంది. భవిష్యత్తులో భారీ మార్పులకు ఇది బాటలు పరుస్తుంది " అని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో కూడా వాయుసేనాధిపతి తేజస్ డెలివరీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "తయారీ సంస్థలు ఉత్పత్తి వేగం పెంచడానికి అత్యాధునిక వ్యవస్థలపై పెట్టుబడులు పెట్టాలి. వారి మానవ వనరుల నైపుణ్యాలకు మెరుగులు దిద్దాలి. తేజస్ తొలి ఎయిర్ క్రాఫ్ట్ 2001 లోనే గాల్లోకి ఎగిరింది. 2016 నుంచి ఇప్పటివరకు తొలి 40 విమానాలు డెలివరీ కూడా పూర్తి కాలేదు " అని నాడు ఆయన వ్యాఖ్యానించడం సంచలనం సృష్టించింది.

# ఈ నట్స్‌ను ఎప్పుడైనా చూశారా..? అనేక అద్భుతాలు చేస్తాయి.. విడిచిపెట్టకుండా తినండి..!



నట్స్.. ఈ పేరు చెప్పగానే మనకు బాదం, జీడిపప్పు, వాల్ నట్స్ గుర్తుకు వస్తాయి. కానీ మనకు తెలియని ఇంకా ఎన్నో రకాల నట్స్ మనకు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో మెకడేమియా నట్స్ కూడా ఒకటి. ఇవి వెన్న రుచిని కలిగి ఉంటాయి. క్రీమ్ లాగా అనిపిస్తాయి. ఎంతో రుచిగా ఉండడమే కాదు అనేక పోషకాలను కూడా అందిస్తాయి. మెకడేమియా నట్స్‌లో క్యాలరీలు, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మెకడేమియా నట్స్‌లో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. ఈ కొవ్వులు మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

**ఆర్థరైటిస్ ఉన్నవారికి..**

మెకడేమియా నట్స్‌లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి ఈ నట్స్ మేలు చేస్తాయి. మెకడేమియా నట్స్‌లో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్లేవనాయిడ్స్, టోకోట్రియనోల్స్ జాబితాకు చెందుతాయి. అలాగే ఈ నట్స్‌లో విటమిన్ ఇ కూడా అధికంగానే ఉంటుంది. ఇవన్నీ శరీరానికి హాని చేసే ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీని వల్ల క్యాన్సర్, డయాబెటిస్, నాడీ సంబంధ సమస్యలు రాకుండా ఉంటాయి. ఈ నట్స్‌లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. నొప్పుల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**మెదడు పనితీరుకు..**

మెకడేమియా నట్స్‌లో ఒమెగా 7 తోపాటు ఒమెగా 9 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా ఉండేలా చేస్తాయి. దీంతో మతిమరుపు తగ్గుతుంది. చిన్నారులు అయితే చురుగ్గా పనిచేస్తారు. మెదడు యాక్టివ్‌గా మారి చదువుల్లో రాణిస్తారు. తెలివితేటలు పెరుగుతాయి. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలు ఉన్నవారు ఈ నట్స్‌ను తింటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ నట్స్‌ను తినడం వల్ల మూడ్ మారుతుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది.

**బరువు తగ్గేందుకు..**

అధిక బరువు ఉన్నవారికి ఈ నట్స్‌ను వరం అనే చెప్పవచ్చు. ఈ నట్స్‌లో క్యాలరీలు, కొవ్వులు అధికంగా ఉన్నప్పటికీ ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బరువు తగ్గేలా చేస్తాయి. రోజూ గుప్పెడు మెకడేమియా నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే శరీరంలోని కొవ్వు కరుగుతుందని, అధిక బరువు తగ్గుతారని సైంటిస్టులు చేపట్టిన పరిశోధనల్లో తేలింది. ఈ నట్స్ వల్ల శరీర మెటబాలిజం మెరుగు పడి కొవ్వు కరుగుతుంది. ఫలితంగా బరువు తగ్గి నియంత్రణలో ఉంటుంది. మెకడేమియా నట్స్‌ను తింటే జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల షుగర్ లెవల్స్‌ను సైతం తగ్గించుకోవచ్చు. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా మెకడేమియా నట్స్ వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# నావికా దళం రంగంలోకి దిగితే పాక్ సర్వనాశనం అయ్యేది

పాక్ టెర్రర్ బేస్‌లను ధ్వంసం చేసింది. అప్పుడు భారత నేవీ బలగాలు ఎంతో దూకుడుగా అరేబియా మహా సముద్రంలో మోహరించాయి. పాక్ నేవీ.. నీటి సరిహద్దులు దాటి ఇటువైపు రావడానికి ధైర్యం చేయలేకపోయింది. పాకిస్థాన్ చాలా అదృష్టం చేసుకుంది. ఒక వేళ ఆపరేషన్ సిందూర్ సమయంలో నేవీ రంగంలోకి దిగి ఉంటే పాక్ పరిస్థితి దారుణంగా ఉండేది. ఇప్పటి వరకు జరిగిందంతా వామ్ అప్ మాత్రమే. ఈ సారి పాకిస్థాన్ యుద్ధానికి దిగితే.. నేవీ కూడా రంగంలోకి దిగుతుంది. అప్పుడు పాక్ పరిస్థితి ఏమవుతుందో ఆ దేవుడికే తెలియాలి' అని అన్నారు.

# తనకు జెండా.. ప్రత్యేక అజెండా లేనేలేదు - స్పష్టం చేసిన కవిత

ఏ పార్టీ కూడా బాగుపడలేదని పార్టీని సొంతంగానే కాపాడుకుందాం అంటూ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు కవిత. తనకు సొంత ఎజెండా అంటూ ఏమీ లేదని.. బీఆర్ఎస్ పార్టీని కాపాడుకోవాలనే ఒకే ఒక్క లక్ష్యం, తపన తప్పితే ఇంకేమీ లేదంటూ మీడియా చిట్ చాట్ లో వెల్లడించారామె. బీజేపీతో పొత్తు, విలీనం అనే రెండు అంశాలకు నేను వ్యతిరేకం అని స్పష్టం చేసిన కవిత.. తాను రాసిన లెటర్ ను సమర్థించుకున్నారు. లెటర్ రాయటంలో తప్పేంలేదని, ఆ లేఖ బయటకు తెచ్చిన వారిని పట్టుకోవాలని, వాళ్లు ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారామె. తండ్రి కేసీఆర్ ను కలవాలని ఎంతో ప్రయత్నించానని, కలిసే అవకాశం వచ్చినా.. కలవలేకపోయానంటూ తన బాధను మీడియా చిట్ చాట్ లో వివరించారు కల్వకుంట్ల కవిత.

# రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఈదురు గాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఆదివారం సైతం రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కాగా రాబోయే మూడు రోజులు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

# ఇప్పట్లో పాక్ కోలుకోవడం కష్టమే : అమిత్ షా

దీటుగా తిప్పికొట్టాయి. దాదాపు 118 పాక్‌పోస్టులను ధ్వంసం చేశాయి.శత్రువుల నిఘా వ్యవస్థను ఒక్కొక్కటిగా కూల్చి వేశాయి. వాటిని పునరుద్ధరించేందుకు శత్రువులకు దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుంది " అని అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నుంచి తనకు అందించిన సమాచారం ప్రకారం... పాక్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు భారీ దెబ్బ తగిలిందన్నారు. కొంతకాలం పూర్తి సమాచార ఆధారిత యుద్ధాన్ని చేసే పరిస్థితిలో వారు లేరన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ సంసిద్ధతపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. భారత సరిహద్దులో ఎటువంటి దాడులు జరిగినా మొదట ఆ భారాన్ని మోసేది బిఎస్ఎఫ్ జవాన్లేనని అన్నారు.

ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జమ్మూకశ్మీర్‌లో అమిత్ షా పర్యటించారు. జమ్ముకశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా.. ఇటీవల పాకిస్థాన్ జరిపిన దాడుల సందర్భంగా నష్టపోయిన కుటుంబాలను అమిత్ షా పరామర్శించారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన పరిహార ప్యాకేజిని కేంద్రం త్వరలో ప్రకటిస్తుందన్నారు. జమ్ము రీజియన్‌లో శాంతిభద్రతల పరిస్థితిని , అమర్‌నాథ్ యాత్ర సన్నాహాలను సమీక్షించారు.

# హిందూకుష్‌లో కరిగిపోతున్న హిమానీనదాలు



భూతాపం మరో 2 డిగ్రీలు పెరిగితే ఈ శతాబ్దం అంతానికి హిందూకుష్ హిమాలయ పర్వత శ్రేణిలో హిమానీ నదాల మంచు 75 శాతం వరకు కోల్పోవచ్చని నూతన అధ్యయనం వెల్లడించింది. హిమానీ నదాలు కరిగిపోవడంపై ఏర్పడే ప్రభావాలపై తజికిస్థాన్ లోని దుషాంబేలో శుక్రవారం అంతర్జాతీయ సమావేశం ప్రారంభమైంది. ఐక్యరాజ్యసమితి విద్య,శాస్త్రీయ, సాంస్కృతిక, సంస్థ, ప్రపంచ వాతావరణ సంస్థ, ఆసియా అభివృద్ధి బ్యాంకు సమన్వయంతో ఈ సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా అధ్యయనంపై చర్చించారు. ప్రపంచ దేశాలు పారిశ్రామిక యుగం కన్నా పూర్వపు స్థితికి 1.5 డిగ్రీల వరకు భూతాపాన్ని అదుపు చేయగలిగితే హిమాలయాల్లోను, కాకసస్ లోను 40 నుంచి 45 శాతం వరకు హిమానీనదాల మంచును కాపాడుకోవచ్చని అధ్యయనం సూచించింది. ఈ శతాబ్దం అంతానికి భూతాపం 2.7డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగితే నాలుగోవంతు హిమానీ నదాల మంచు కోల్పోవనడమౌతుందని పేర్కొంది. 2015 పారిస్ ఒప్పందం ప్రకారం భూతాపాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్‌కు అదుపు చేయగలిగితే అన్ని రీజియన్లలో కొంతవరకు హిమానీ నదాల మంచు నిలిచి ఉంటుందని ఈ అధ్యయనం ప్రధానంగా సూచించింది.

ఈమేరకు అనుకున్న లక్ష్యం సాధిస్తే ప్రస్తుత హిమానీనదాల మంచులో 50 శాతం మిగిలి ఉంటుందని, అలాగే నాలుగు సున్నిత ప్రాంతాల్లో 20 నుంచి 30 శాతం వరకు మంచు స్థిరంగా ఉంటుందని అంచనా వేసింది. ఈ సదస్సులో ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు వైస్ ప్రెసిడెంట్ యింగ్‌మింగ్ మాట్లాడుతూ హిమానీనదాల మంచు కరిగిపోవడం జీవితాలకు ప్రమాద సూచిక అని, ఆసియా లోని 2 బిలియన్ కన్నా ఎక్కువ మంది ఈ హిమానీనదాల ఆధారంగా జీవిస్తున్నారని వెల్లడించారు. కర్బన ఉద్గారాలను నిరోధిస్తే హిమానీ నదాలు కరిగిపోవడం మందగిస్తుందన్నారు. ప్రపంచం మొత్తం మీద 2, 00,000హిమానీ నదాల మంచు కరిగిపోవడాన్ని గణించడానికి 10 దేశాలకు చెందిన 21 మంది శాస్త్రవేత్తలు ఎనిమిది హిమానీనదాల నమూనాలను ఉపయోగించారని చెప్పారు. ఈ దృశ్యాలన్నిటిలో హిమానీనదాలు కొన్ని దశాబ్దాలుగా మంచును విపరీతంగా వేగంగా కోల్పోయినట్టు బయటపడిందని , ఇది కొన్ని శతాబ్దాలపాటు కొనసాగుతుందని తెలిపారు.

సత్యమేవ జయతే



## తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ ఏర్పాటు

### రాష్ట్ర అధ్యక్షులుగా దరువు అంజన్న

### రాష్ట్ర చైర్మన్ గా అన్వోజు వెంకటేష్

### వర్కింగ్ ప్రెసిడెంట్ గా నకరికంటి కిరణ్







**సత్యమేవ జయతే, మే 30, కుత్బుల్లాపూర్ ప్రతినిధి :-** తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా ఆడి పాడి తెలంగాణ రావడంలో కీలక పాత్ర వహించింది కళాకారులే అని చైర్మన్ గా ఎన్నికైన అనువోజు వెంకటేష్ అన్నారు, హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి విస్తృత స్టాయి సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఎన్నుకోబడిన ప్రజా ఉద్యమకారుడు, ఉస్మానియా ఉద్యమ ధీరుడు దరువు అంజన్న మాట్లాడుతూ తెలంగాణ లో కళాకారులకు పెద్దపీట వేస్తానని ప్రగల్భాలు పలికిన టిఆర్ఎస్ ప్రభుత్వం 500 మందికి ఉద్యోగాలు కల్పించి మిగతా అసలైన కళాకారులకు అన్యాయం చేసిందని, పది సంవత్సరాలుగా ఎండనకా,వాననక ఉద్యమాలు కొనసాగిస్తున్నా,టిఆర్ఎస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వహించిందని కనీసం ఇప్పుడు ఏర్పడిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పించి వారి జీవితానికి భరోసా కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ నకరెకంటి కిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా మాట నిలుపుకోవాలని నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని అన్నారు. ఈ సందర్భంగా కమిటీని ప్రకటించారు.తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం. రాష్ట్ర అధ్యక్షులుగా దరువు అంజన్న,ఉద్యమ కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు చైర్మన్గా అనువోజు వెంకన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా నకరికంటి కిరణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గజ్వేల్ ప్రతాప్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జువ్వాజి ప్రవీణ్, మట్టెడ కవిత, సహాయ కార్యదర్శిగా పేరాల యాదగిరి, పాలాటి రాజు, కోంద్ర కుమార్,ప్రచార కమిటీ కార్యదర్శిలుగా నకిరేకంటి చిరంజీవి, బానోతు నర్మదా, ఎండి హైమద్, గణేష్,సోషల్ మీడియా ఇన్చార్జిలు కొండకూరి రాజు, పాట రాజశ్రీ, పల్లికొండ దత్తు, కోల వెంకట్,సన్నీ సందీప్,సంయుక్త కార్యదర్శిలుగా గుడాల సత్యనారాయణ, పందిరి సైదులు, సిద్దిపేట శ్రీనివాస్ యాదవ్, సాంస్కృతిక కార్యదర్శిలుగా మోతె రమేష్,గంగాధర్ నాయక్,పాట మహేష్, దబిడ పుష్పలత, కొంకటి రాజేశ్వరి, పరకాల రామా, కోశాధికారులుగా ఎండి సలీం, మహంకాళి శారద, కార్యవర్గ సభ్యులుగా కలవేని కృష్ణవేణి, రానింగు సరస్వతి, అమ్రాస్ చిట్టిబాబు, డోంగ్రి సంతోష్,గణేష్, పిట్టల ఉమాపతి, శ్రీనివాస్ యాదవ్ తదితరులను ఎన్నుకొన్నారు.


## అసంపూర్తి బ్రిడ్జిలతో ఖరీఫ్ పనులకు విఘాతం.. సిర్సన్న గ్రామ రైతుల ఆందోళన





సత్యమేవ జయతే – ఆదిలాబాద్ ఆదిలాబాద్ : మండలంలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సిర్సన్న గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలు చెరువుల తలపిస్తున్నాయి. అసంపూర్తి బ్రిడ్జి నిర్మాణ పనులతో నీరు పంటపొలాల్లో చేరి నిలువు ఉంటున్నాయని ఖరీఫ్ పనులు ఎలా చేసుకోవాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అంతరాష్ట్ర రహదారి 353 బ్రిడ్జి నిర్మాణ పనులు నత్త నడకన కొనసాగుతున్నాయి. ఈ కారణంగానే రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి నీరు మొత్తం రైతుల పొలంలో చేరి చెరువుల తలపిస్తున్నాయని రైతులు వాపోయారు. బ్రిడ్జి పనులు చేపట్టిన కాంట్రాక్టర్పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల్లోకి నీరు చేరడం వల్ల పొలంలో ఉన్న బోరుబావి కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళనకు గురవుతున్నారు. ఖరీఫ్ సాగు కోసం విత్తనాలు విత్తడానికి సిద్ధం కావాల్సిన తరుణంలో పొలంలో వరద నీరు చేరడంతో పనులు ఎలా ప్రారంభించాలని ప్రశ్నిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు గుత్తేదారు వెంటనే పూర్తి చేయాలని, లేకపోతే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## డల్లాస్ లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ ఘన స్వాగతం




సత్యమేవ జయతే – కోరుట్లకోరుట్ల : ఆర్ఎస్ రజతోత్సవ, తెలంగాణ ఆవిర్భావ వేడుకలలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ ఎన్నారై విభాగం ఆహ్వానం మేరకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అమెరికాకు వెళ్లారు.బీఆర్ఎస్ రజతోత్సవ, తెలంగాణ ఆవిర్భావ వేడుకలలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ ఎన్నారై విభాగం ఆహ్వానం మేరకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అమెరికాకు వెళ్లారు. అక్కడ డల్లాస్ విమానాశ్రయంలో ఆయనకు ప్రవాస తెలుగు వారు, బీఆర్ఎస్ ఎన్నారై విభాగం సభ్యులు ఘన స్వాగతం పలికారు.

# బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు..

# నాన్ బెయిలెబుల్ కేసులు : డీసీపీవో హెచ్చరికలు



సత్యమేవ జయతే – ఆదిలాబాద్ ఆదిలాబాద్ : బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీవో బుర్ల మహేష్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని చెద్వాయి కొత్తగూడెం గ్రామానికి చెందిన మైనర్ బాలికకు బాల్య వివాహం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు గ్రామాన్ని సందర్శించి బంధువులు, కుటుంబ సభ్యులు,కుల పెద్దలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం వల్ల ఎదురయ్యే నష్టాలను, కేసుల ద్వారా ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని బాల్య వివాహాలు చేస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష ,లక్ష రూపాయల జరిమానా విధిస్తున్నామని వెల్లడించారు. అంతేగాకుండా నాన్‌బెయిలెబుల్ కేసులను నమోదు చేస్తామని తెలిపారు. 2030 వరకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన బాల్య వివాహ రహిత భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన వివరించారు.

ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లు దృష్టికి వస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098 , 112 లకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ బాల ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్ రవళి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, కానిస్టేబుల్ సురేష్, సాయిలత పాల్గొన్నారు.

# ఉచిత క్రీడా శిక్షణా శిబిరాలు సమాజానికి ఎంతో అవసరం.. బుల్లితెర హాస్యనటుడు ఆర్ఎస్ నంద

సత్యమేవ జయతే – హుజూరాబాద్

హుజురాబాద్: ఉచిత క్రీడా శిక్షణా శిబిరాలు సమాజానికి ఎంతో అవసరమని బుల్లితెర హాస్యనటుడు ఆర్ఎస్ నంద( ఆర్ సదానందం) అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాస్యనటుడు ఆర్ఎస్ నంద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులను సెల్ఫోన్లకు అతుక్కుపోకుండా క్రీడలు దోహదపడుతాయన్నారు. ప్రతీ సంవత్సరం ఇలానే ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసి క్రీడలను విద్యార్థుల బంగారు భవిష్యతుకు పునాదులు వేయాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు పౌష్ఠికాహారాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెంసారపు సమ్మయ్య, మున్సిపల్ ఇంజనీర్ సాంబరాజు, కార్యాలయ మేనేజర్ ఆర్ భూపాల్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్ పెక్టర్లు జే శ్రీకాంత్, రషీద్, డాక్టర్ వీణ, వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరిప్రసాద్,



అసోసియేషన్ సభ్యులు, హాకీ అసోసియేషన్ ప్రెసిడెంట్, కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్, వార్డు అధికారులు, సానిటరీ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది, ప్రముఖులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి



సత్యమేవ జయతే – కరీంనగర్ కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకిచ్చిన హామీలు అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లాశాఖ డిమాండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం జేఏసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఎలుగు కవిత ఆధ్వర్యంలో పలువురు ఉద్యమకారులు ఆర్డీవో మహేశ్వర్ ను కలిసి హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలైన ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఉచిత ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వటం, ఉద్యమకారులకు సమరయోధులుగా గుర్తించి, ప్రతి నెల రూ.30వేల గౌరవ వేతనం మంజూరు, ఒక్కో ఉద్యమకారునికి రూ.20లక్షల ప్రమాద బీమా సౌకర్యం, అమరవీరుల పేర స్మృతి వనం ఏర్పాటు, ప్రభుత్వ పథకాల మంజూరీలో మొదటి ప్రాధాన్యత, నామినేటెడ్ పోస్టుల్లో ఉద్యమకారులను నియమించడం, తదితర హామీల అమలుకు వెంటనే కార్యచరణ ప్రారంభించాలన్నారు.

లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో విడతల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం సూపరెంటెండెంట్ కు వినతిపత్రం అందజేశారు.


## పలు గ్రామాల్లో ఉపాధ్యాయుల బడిబాట.. విద్యార్థుల పేర్లు నమోదు



సత్యమేవ జయతే – కరీంనగర్ కరీంనగర్ : మండలంలోని చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, ముల్కనూర్ తదితర అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

అనంతరం గ్రామంలో విద్యార్థులతో కలిసి 2025- 26 విద్యా సంవత్సరానికి విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు గ్రామంలో ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను, మౌలిక వసతులను, బోధన విధానాలను విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంటింటా వివరించారు.కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు ఉన్నతమైన విద్యను ఉపాధ్యాయులు అందిస్తున్నారని వివరించారు. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలను బతికించుకోవాలని గ్రామస్తులను ఉపాధ్యాయులు కోరారు. ఇంటింటా తిరిగి విద్యార్థులను పాఠశాలలో చేర్పించుటకు పేర్ల నమోదు చేసుకున్నారు. జూన్ 2 నుండి ప్రతిరోజు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారిని వి. పావని తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీలోకి వచ్చి సిద్ధంగా ఉన్నాయన్నారు.

## రాష్ట్ర పరిశీలకుడిగా ఇందుర్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాషబత్తిని ఓదెలు కుమార్ నియామకం



సత్యమేవ జయతే – కరీంనగర్ కరీంనగర్ : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు భాషబత్తిని ఓదెల కుమార్ బోధనలో అత్యధిక సాంకేతికథ జోడించి, బోధన చేయాలని రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుడిగా ఎస్సీఆర్టీ ద్వారా రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుడిగా నియమితులయ్యారు.ఈనెల 13 నుండి 31 వరకు ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, అదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా కేంద్రాల్లోని వివిధ పాఠశాలలు నిర్వహిస్తున్న భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయ శిక్షణ శిబిరాలను సందర్శించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పాఠశాలలో విద్యార్థులకు ఆసక్తి కలిగేలా అత్యాధునిక సాంకేతిక పద్ధతులను బోధనలో వినియోగించాలని, నూతన వరవడితో బోధించాలని, పరిసరాలలో లభించి టీఎల్ఎంను ఎన్నో ఉపయోగించాలని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సైన్స్ అధికారులు, కోర్సు డైరెక్టర్లు, జిల్లా రిసోర్స్ పర్సన్ లు పాల్గొంటారని ఓదేలు కుమార్ తెలిపారు.కాగా రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుడిగా ఓదెలు కుమార్ నియామకం పట్ల మండలంలోని రేకొండ స్వగ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే కోరం కనకయ్య



సత్యమేవ జయతే - ఖమ్మం ఖమ్మం : ఉపాధి హామీ పథకాన్నిపేదలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం టేకులపల్లి మండలం కొప్పురాయి గ్రామ పంచాయతీ రాజారామ్ తండాలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉపాధి శ్రామికులకు రాజారామ్ తండా నందు 100 బాస్కెట్లు (బొచ్చులు), 60 గడ్డపారులు పంపిణీ చేశారు. అలాగే బోడు గ్రామ పంచాయతీ బోడు గ్రామం నందు పనిచేస్తున్న ఉపాధి కూలీలకు 100 బొచ్చులు, 60 గడ్డపారలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాది హామీ పథకం పేదలకు మంచి వరమని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రతిరోజు ప్రతి శ్రామికుడు రూ.307 పనిని ఖచ్చితంగా కొలతల ప్రకారం చేయాలన్నారు. మండలంలో బోరు బావి ఉన్న ప్రతి రైతు విధిగా ఫారం పాండ్ పనులు వారి భూముల్లో నిర్మించుకుని ఆర్థికంగా పురోగతి చెందాలని ఆకాంక్షించారు. పండ్ల తోటలు పెంపకం, మునగ సాగు, చేప పిల్లల పెంపకం, పశు వులకు, మేకలకు షెడ్లు ఉపాధి హామీ నుంచి ఇస్తున్నందున మండలంలో ఆసక్తి గల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి శ్రామికుడు తప్పక ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు.

# సీకేఎం హాస్పిటల్‌లో వైద్యుల నిర్లక్ష్యం.. ప్రాణాపాయ స్థితిలో బాలింత



సత్యమేవ జయతే - వరంగల్ వరంగల్ : వరంగల్ సీకేఎం హాస్పిటల్‌లో వైద్యుల నిర్లక్ష్యం బాలింత ప్రాణం మీదకు వచ్చింది.

బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ కాశీకుంట ప్రాంతానికి చెందిన నజియా భాను(32) ఆదివారం రాత్రి సుమారు 10:30 నిమిషాలకు ప్రసూతి సేవల కోసం సీకేఎం ఆస్పత్రికి తీసుకువచ్చారు. రాత్రి సుమారు నాలుగు గంటల పాటు శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులు బాబు జన్మించినట్లు తెలిపి, అప్పగించారు. గడిచిన ఆరు రోజులు మహిళను కుటుంబ సభ్యులకు చూపించకుండా వైద్య సేవలు కొనసాగుతున్నట్లు తెలియజేస్తూ వచ్చారు. శుక్రవారం ఉదయం నజియా బేగం ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని వెంటనే ఎంజీఎం హాస్పిటల్‌కి తరలించాలని వైద్యులు తొందర పెట్టడంతో కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ కేసు షీట్ అందజేయాలని కోరడంతో కేసు షీట్ పోయిందని, కావాలంటే కొత్త కేసు షీట్ రాసిస్తామని చెప్పడంతో కుటుంబసభ్యులు కంగుతిన్నారు. కేసు షీట్ పోయిందనడంతో కుటుంబసభ్యులు నజియా బేగంను వెంటనే చూపించాలని పట్టుబట్టారు. అప్పటికే నజియా బేగం పొట్ట భాగం విపరీతంగా ఉబ్బి ఉండడంతో వైద్యుల నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, హాస్పిటల్ భవనం ముందు ధర్నా చేసి, నిరసన వ్యక్తం చేశారు.

# రూ. 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు సాధ్యం కాదు : ఎమ్మెల్యే రామచంద్ర నాయక్



సత్యమేవ జయతే - వరంగల్ రూరల్ వరంగల్ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు అందజేస్తున్న ఐదు లక్షల రూపాయలతో ఇల్లు నిర్మాణం సాధ్యం కాదు అని డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

శుక్రవారం మరిపెడ మండల కేంద్రంలోని ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని కళ్యాణ లక్ష్మి, కాటమయ్య కిట్, పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కొరకు డ్వాక్రా గ్రూపుల వద్ద ఒక లక్ష వరకు అప్పు తీసుకోవడానికి పర్మిషన్ ఇస్తున్నాం, లేదా ఇంటి పత్రాలు సరిగా ఉంటే బ్యాంకుల వద్ద కూడా ఇంటి నిర్మాణానికి అప్పు తీసుకోవచ్చు. కానీ లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ ఉంటేనే బ్యాంకులో అప్పు ఇచ్చేందుకు ముందుకు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి నరసింహులు, తహసిల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో విజయ, ఎంఈఓ గాదే అనిత దేవి, ఆర్ఐ శరత్ చంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- సమయపాలన పాటించని ఎమ్మెల్యే

మండలంలోని కళ్యాణ లక్ష్మి, కాటమయ్య కిట్, పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయడానికి మండల కేంద్రంలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమకై మధ్యాహ్నం 12 గంటలకు లబ్ధిదారులకు సమయం ఇవ్వడంతో లబ్ధిదారులు సమయానికి ఆడిటోరియానికి చేరుకొని ఎమ్మెల్యే రాక కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. మధ్యాహ్నం భోజన సమయం అవుతున్న ఎమ్మెల్యే రాకపోవడం, మధ్యాహ్నం రెండు గంటల 30 నిమిషాలకు ఎమ్మెల్యే రావడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు.. హెచ్చరించిన స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీ



సత్యమేవ జయతే - వరంగల్ రూరల్ వరంగల్ రూరల్ : నకిలీ విత్తనాలు ఎవరు విక్రయించిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్టేషన్ ఘనపూర్ ఏసీపీ భీం శర్మ హెచ్చరించారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ఉన్న బిల్ బుక్స్‌ను, స్టాక్ రిజిస్టర్లతో పాటు నిల్వ ఉన్న విత్తనాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆమోదం తెలిపిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. రైతులు కూడా తాము తీసుకున్న విత్తనాలకు, ఎరువులకు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట సిఐ శ్రీనివాస్ రెడ్డి. ఎస్సై శ్రావణ్ కుమార్, ఏవో వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## హ్యూస్టన్‌లో ఆలయాలను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యేలు



సత్యమేవ జయతే - వరంగల్ రూరల్ వరంగల్ రూరల్ : బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు అమెరికాలోని డల్లాస్‌లో జూన్ 1న ఘనంగా జరుగనున్నాయి. వేడుకల్లో పాల్గొనడానికి డల్లాస్ వెళ్లిన మాజీ ఎమ్మెల్యేలు చల్ల ధర్మారెడ్డి (పరకాల), వెంకటరమణారెడ్డి (భూపాలపల్లి), పెద్ది సుదర్శన్ రెడ్డి (నర్సంపేట).. అమెరికాలోని పెద్ద నగరాల్లో ఒకటైన హ్యూస్టన్‌లో ఉన్న పలు దేవాలయాలను సందర్శించారు. అష్టలక్ష్మి, శారదాంబ, షిరిడీ సాయి, జలారాం దేవాలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా టెక్సాస్ లోని రిచ్‌మండ్ ప్రాంతంలో ఉన్న శారదా పీఠాన్ని మాజీ ఎమ్మెల్యేల బృందం సందర్శించింది. కాగా పర్యటనలో మాజీ ఎమ్మెల్యేలతో భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఉన్నారు.

## న్యాక్ ఆధ్వర్యంలో ఎస్సీ మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ



సత్యమేవ జయతే - కొత్తగూడెంకొత్తగూడెం : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో ఎస్సీ మహిళలకు టైలరింగ్‌లో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా డైరెక్టర్ వెంకటరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం పట్టణం ప్రగతి మైదాన్‌లోని న్యాక్ శిక్షణ కేంద్రంలో నిర్వహించే ఈ కోర్సులో (బ్లౌజు డిజైన్స్, పంజాబీ డ్రెస్ డిజైన్స్, ఫ్రాక్స్, నిక్కర్, షర్ట్, మోడల్ బ్లౌజులు) శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు.


శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్, సర్టిఫికేట్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన, ఆసక్తి కలిగిన మహిళలు ఆధార్ కార్డ్, ఫొటోలు (4), రేషన్ కార్డు, ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికేట్స్‌తో శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. 18 నుండి 35 స%శీ%వత్సరాల వయస్సు కలిగిన మహిళలు శిక్షణకు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 9292650982 నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవాల్సిందిగా సూచించారు. కొత్తగూడెం జిల్లాలోని ఎస్సీ మహిళలు ఈ అవకాశాన్ని సధ్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## వికాస్ కృషి సంకల్ప అభియాన్ పై రైతులకు అవగాహన సదస్సు




సత్యమేవ జయతే - వరంగల్ రూరల్ వరంగల్ రూరల్ : వికాస్ కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన సదస్సు శుక్రవారం ధర్మసాగర్ మండలం మలకపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కె వి కె మామ్నూర్ వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న హాజరై మాట్లాడారు. ప్రతి రైతు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ అధిక లాభాలు పొందాలన్నారు. డాక్టర్ సురేష్ వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలన్నారుఎ. రైతులు ఒకే పంట బదులుగా వివిధ రకాల పంటలను సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు.వరి, మొక్కజొన్న పత్తితో పాటుగా వివిధ రకాల నూనె గింజల పంటలు ఆముదం, నువ్వులు, కుసుమ పప్పు దినుసులను సాగు చేసుకోవాలన్నారు. సస్యరక్షణకు ట్రైకోడెర్మా వంటి జీవ నియంత్రిక కారకాలను వినియోగించడం ద్వారా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు.ఈ కార్యక్రమంలో సురేష్, సాయికిరణ్, ఎఈఓ కల్యాణ్, ఎంపీటీసీ కరుణాకర్, గ్రామ కార్యదర్శి అనుపమ, విజయ డెయిరీ సూపర్‌వైజర్ రఘు, శోభ, పశు వైద్య సహచరులు ఎల్లారెడ్డి పాల్గొనన్నారు.

## బోనస్ డబ్బుల కోసం రైతులు ఎదురుచూపులు.. పట్టించుకోని అధికారులు



సత్యమేవ జయతే - మహబూబాబాద్‌మహబూబాబాద్ :మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మపురం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులు రైతులను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రంలో 15 రోజులుగా ధాన్యం కాంటాలు కాకపోవడం గురించి నమస్తే తెలంగాణ దినపత్రికలో వార్త వెలువడిన నేపథ్యంలో జిల్లా అదనపు కలెక్టర్ వీర బ్రహ్మచారి శుక్రవారం అమ్మాపురం, మాటేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మపురం గ్రామానికి చెందిన మహిళా రైతు గుంటుక సోమలక్ష్మి మాట్లాడుతూ.. "మాకు యాసంగి బోనస్ డబ్బులు బ్యాంకులోకి పడడం లేదు, ఎందుకు రావడం లేదో చెప్పండి" అని అడిగినప్పటికీ ఆమె ప్రశ్నకు ఏ మాత్రం స్పందించకుండా అదనపు కలెక్టర్ కారెక్కి అక్కడి నుండి వెళ్లిపోయారు.

అదేవిధంగా రైతులు పేర్కొంటూ, "ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్చార్జీలు, కొంతమంది అధికారులు కలిసి రైతులను ఇబ్బంది పెడుతున్నారు. అధికారులను ఏదైనా ప్రశ్నిస్తే, వారి ధాన్యాన్ని కాంటాలు పెట్టకుండా ఆలస్యం చేస్తున్నారు," అని వాపోతున్నారు. అయితే అధికారులు ఈ విషయంపై మౌనం పాటించడం రైతుల ఆవేదనను మరింత పెంచుతోంది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి మాట్లాడుతూ, "జిల్లాలో ఇప్పటివరకు 1,74,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. రెండు మూడు రోజుల్లో కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని తరలిస్తాం," అని తెలిపారు.

అమ్మపురం కేంద్రంలో ఇంకా 5,000 బస్తాలు కాంటాలు కాకుండా ఉన్నాయని,5000 బస్తాలు తరళించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అంతేగాక, జిల్లాలో 95 శాతం ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందని, మిగిలిన 5%-%10 శాతం ధాన్యాన్ని త్వరలో కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా తొర్రూరు పిఏసిఎస్ సిబ్బందిపై వెలువడిన అక్రమ వసూళ్ల మీద కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరాఫరల అధికారి ప్రేమ్ కుమార్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ కృష్ణవేణి,డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, తహసిల్దార్ శ్రీనివాస్, ఏవో రాంనర్సయ్య, ఆర్ఐ బషీర్, పిఎసిఎస్ సిబ్బంది, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే



# సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెక్రటరీ అలుగు వర్షినిని సస్పెండ్ చేయాలి

సత్యమేవ జయతే – మహబూబ్ నగర్‌మహబూబ్ నగర్ : సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యార్థుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెక్రెటరీ అలుగు వర్షినిని వెంటనే సస్పెండ్ చేయాలని అంబేద్కర్ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు జక్క బాలకిష్టయ్య, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్ డిమాండ్ చేశారు.శుక్రవారం అమ్రాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులతో బాత్‌రూం, ల్యాట్రిన్ రూంలు కడిగించాలని, బూజు దులిపించాలని అహంకారపూరిత వ్యాఖ్యలు దళితులను కించపరిచే విధంగా ఉన్నాయని అన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో ఎక్కువగా దళితులు, పేద విద్యార్థులే ఉన్న విషయాన్ని మరిచిపోవడం బాధాకరమని పేర్కొన్నారు.రాజ్యాంగం, చట్టాల పట్ల గౌరవం లేని ఆమెతో సమాజానికి పెను ప్రమాదం ఉందని అన్నారు. సోషల్ వెల్ఫేర్ సొసైటీల్లో దళితులనే నియమించాలని డిమాండ్ చేశారు. గతంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సెకరెట్రీగా పనిచేసిన సమయంలో రెసిడెన్షియల్ స్కూళ్లు ఎంతగానో అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. సమావేశంలో అంబేద్కర్ మండల మాజీ అధ్యక్షులు అవుట రామకోటి ఎల్లస్వామి , ఆశోది శేఖర్, మనోహర్ కాశి పాండీయన్ , దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.




## భూభారతి సదస్సులు నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలి : కలెక్టర్ బీఎం సంతోష్




సత్యమేవ జయతే – జోగులాంబ గద్వాల్ జోగులాంబ గద్వాల్ : జూన్ 3 నుంచి 20 వరకు జరిగే భూ భారతి సదస్సులను పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో భూ భారతి రెవెన్యూ సదస్సుల పై తహసీలర్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలకు అవగాహన సదస్సు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భూమికి సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ధరణి స్థానంలో భూ భారతి చట్టం అమలు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త చట్టం ద్వారా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు– చేర్పులు, వారసత్వ భూములు, సాదా బైనామాలు, ఓఆర్సీ వంటి సేవలు సులభతరం అవుతుందని వివరించారు. జిల్లాలో ఇటిక్యాల మండలంలో భూ భారతి పైలట్ ప్రాజెక్టుగా విజయవంతంగా నిర్వహించి,దరఖాస్తులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు.రెవెన్యూ సదస్సుల నిర్వహణకు తహసీల్దార్లు గ్రామాల వారిగా షెడ్యూల్ రూపొందించి పంపాలని ఆదేశించారు. జూన్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించి,ఆగష్టు 14కు ముందుగా అన్ని దరఖాస్తులు పరిష్కరించాలని సూచించారు. భూ భారతి చట్టంతో తహసీల్దార్ స్థాయి నుంచే అప్పీల్‌కి అవకాశం ఉండటం వల్ల భూ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించాలి: మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి





సత్యమేవ జయతే – అచ్చంపేట అచ్చంపేట: జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించాలని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పాత్రికేయులు కనీస ధర్మం పాటించడం లేదని విమర్శలు ఈమధ్య బాగా పెరిగాయని, అందుకు కారణం మనమేనని చెప్పారు. మన నైతిక విలువలు కాపాడుకోవడంతోపాటు పారదర్శకతతో కూడిన వార్తలను ప్రచురించినప్పుడు ప్రజల్లో మనపై గౌరవం పెరుగుతుందని వెల్లడించారు. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని అటవీ శాఖ వనమాలిక ఆవరణలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా పాత్రికేయులకు వివిధ అంశాలపై అవగాహన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీనివాస్‌రెడ్డి 'నైతిక నియమాలు, మీడియా– చట్టాలు' అనే అంశంపై మాట్లాడుతూ.. మీడియా అకాడమీ నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు పాత్రికేయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ఈ శిక్షణలో పాత్రికేయులు దాదాపుగా నూటికి 90 శాతం మంది ఉన్నత విద్యాభ్యాసం చేసిన వారు ఉండడం సంతోషకరమన్నారు. త్వరలోనే పాత్రికేయులకు హైదరాబాద్‌లో వారం రోజులపాటు మీడియా అకాడమీ ద్వారా కంప్యూటర్ శిక్షణ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, అది కంప్యూటర్‌పై అవగాహన లేని వారందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పత్రికలు మొన్నటి వరకు స్వాతంత్ర కోసం పనిచేశాయని నేడు స్వతంత్ర దేశంలో పత్రికలు పెట్టుబడిదారీ విధానం అమలుపరుస్తున్నాయని, జర్నలిస్టుల సంక్షేమం కోసం 1952లో మీడియా చట్టం వచ్చిందని వర్కింగ్ జర్నలిస్టులో హక్కుల కోసం ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1995లో తీసుకొచ్చిందని, ఐదు రకాల వేతన చట్టాలు వచ్చిన అమలు విషయంలో జాప్యాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సిఫారసు చేసిన అంశాలను క్రోడీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం వాటిని అమలు చేయాలని ప్రెస్ కౌన్సిల్ సిఫారసు చేసిన కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్లుగా కాలయాపన చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాత కార్మిక చట్టాలకు కాలం చెల్లిందని, కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను రద్దు చేస్తే అందులో వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ కూడా ఉందని గుర్తుచేశారు. ఇలా కాలయాపన చేయడం అన్ని కార్మిక చట్టాలకు చాలా ప్రమాదమన్నారు.జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించకపోతే, జర్నలిస్టులు నైతిక ప్రమాణం పాటించడం లేదని విమర్శలు ఈమధ్య బాగా పెరిగాయని, అందుకు కారణం మనమేనని మన నైతిక విలువలు కాపాడుకోవడంతోపాటు పారదర్శకతతో కూడిన వార్తలను పరిచరించినప్పుడు ప్రజల్లో మనపై గౌరవం పెరుగుతుందన్నారు. కాపున ప్రతి రిపోర్టరు వార్తల విశ్వసనీయతపై దృష్టి కేంద్రీకరించాలని, కనీస ధర్మం తప్పక పాటించినప్పుడే మరింత గౌరవం పెరుగుతుందన్నారు.నేటి తరంలో పాత్రికేయులు, రాజకీయ నాయకులు, పోలీసుల నుంచి విలేకరులపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతుందని ఇది మంచి పద్ధతి కాదన్నారు. అందుకు కారణాలు ఏమైనా ఉన్నప్పటికీ అలాంటి వాతావరణం ఉండకూడదని, పాత్రికేయులపై ఎక్కడ చిన్న దాడి జరిగినా హక్కుల కోసం పోరాటం చేసినప్పుడే మనం అనుకున్న లక్ష్యాలను సాధించుకో గలమని వివరించారు. ఏ పత్రికలో అయినా యజమాని ఉద్యోగి సంబంధాలు ఉంటాయా అతడే జర్నలిస్టని, అతడు పార్ట్ టైం, ఫుల్ టైం అనే అంశం కారణం కాదన్నారు. ఈ సమావేశంలో అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఎడిటర్ ఉడుముల సుధాకర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ తోట భావనారాయణ, జిల్లా పాత్రికేయులు సుమారు 80 మంది పాల్గొన్నారు.

## శాంతియుతంగా బక్రీద్ జరుపుకోవాలి.







సత్యమేవ జయతేహిత్నూర: బక్రీద్ పండుగను శాంతియుతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని సిఐ నయీముద్దీన్ అన్నారు. శుక్రవారం హత్నూర పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 7న బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. పండుగ రోజున ఆవులను అక్రమంగా రవాణా చేయడం లేదా వధించడం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించడం ,మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రయత్నాలు చేసిన కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ముస్లిం మత పెద్దలు, యువకులు బక్రీద్ పండుగను సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, నాయకులు యువకులు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నూతన గ్రామ పంచాయతీ భవనం, నూతన హాస్పిటల్ బిల్డింగ్ మంజూరు



సత్యమేవ జయతే :వట్పల్లి 31మే సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ మర్వెల్లి గ్రామం లో గ్రామ సభ కు ముఖ్య అతిథిగా వచ్చిన వట్పల్లి మండల్ స్పెషల్ ఆఫీసర్ %డ%తహసీల్దార్ శ్రీనివాస్ రావు మాట్లాడు తు మరవెల్లి గ్రామానికి నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్, హాస్పిటల్ బిల్డింగ్ మంజూరు అయినదని మర్వెల్లి గ్రామ ప్రజలకు తహసీల్దార్ తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మర్వెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిఖాజా మైనొ ద్దీన్,తాజా మాజీ ఉపసర్పంచ్ బస్వారాజు, గ్రామ పెద్దలు రాజు పటేల్, మాజీ ఉపసర్పంచ్ జుట్టు నర్సిములు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ జుట్టు చిన్న నర్సిములు, రేగోటి నాగన్న, మేతరి బల్లయ్య, ఒగ్గు దుర్గయ్య, నబిసాబ్, గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యా బోధన : ఎంఈవో



సత్యమేవ జయతే – మహబూబ్ నగర్ మహబూబ్ నగర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్యా బోధన లభిస్తుందని ఎంఈవో రాజేశ్వర్ రెడ్డి, కురుమూర్తి, టీపీయుటీఎఫ్ మహబూబ్‌నగర్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ దుంకుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అడ్డాకుల, మూసాపేట మండలాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్డాకుల మండల కేంద్రంతోపాటు శాఖాపూర్, కందూరు, రాచాల, పొన్నకల్, పెద్దమునగలచెడు, తదితర గ్రామాల్లో, మూసాపేట మండల కేంద్రంతో పాటు జానంపేట, నిజాలాపూర్, వేముల కొమిరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో బడిబాటను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని , సర్కారు బడిని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రచార యాత్రను టీపీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎస్ కిష్టయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయ ప్రయోజనాలు మాత్రమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం దిశగా ప్రచార యాత్ర నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. మంచి సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే విలువలతో కూడిన విద్య అందుతుందని అన్నారు. టీపీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కే రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేష్ , జిల్లా నాయకులు వి భాస్కర్, హేమంత్ కుమార్, అజయ్, జయంతి, శంకర్ నాయక్, చిన్నయ్య, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## కేర్చిపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి : మద్దెల మంజుల



సత్యమేవ జయతే – నల్గొండ నల్గొండ : వలిగొండ మండలంలోని కేర్చిపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మద్దెల మంజుల అన్నారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ మహిళలతో కలిసి యాదగిరిగుట్ట డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామానికి బస్సు సౌకర్యం లేక వివిధ రకాల పనుల మీద జిల్లా కేంద్రానికి, మండల కేంద్రానికి ప్రయాణికులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థుల ప్రయాణ సమస్యలను పరిష్కరించడం కోసం బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు.

### ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా చూడాలి : ఎమ్మెల్యే బాలునాయక్



సత్యమేవ జయతే – దేవరకొండ దేవరకొండ : దేవరకొండ నియోజవర్గ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండభీమనపల్లి గ్రామంలో గల దొంతినేని సంపత్ అమ్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలని పార్టీ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మారుపాకుల అరుణా సురేశ్‌గౌడ్, కొండభీమనపల్లి మాజీ సర్పంచ్ మునుకుంట్ల విద్యావతి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఫ్లై ఓవర్ నిర్మించాలని కోదాడ బైపాస్‌పై పలు గ్రామాల ప్రజల ధర్నా

సత్యమేవ జయతే – కోదడ

కోదాడ : కోదాడ–కట్టకమ్ములగూడెం గ్రామాల మధ్య కోదాడ శివారులో బైపాస్ రోడ్డుపై ఫ్లై ఓవర్ నిర్మించాలని బాబునగర్ రామాపురం, నరసింహాపురం, కట్టకొమ్ములగూడెం, ఆర్లగూడెం, రామచంద్రనగర్, కొండాపురం, ఉత్తమ్ పద్మావతి కాలనీ తదితర గ్రామాల ప్రజలు వందలాది మంది శుక్రవారం బైపాస్ రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ.. 65వ నంబర్ జాతీయ రహదారి మీదుగా నిత్యం సమీప గ్రామాల్లోని వందలాది మంది ప్రజలు ఆయా గ్రామాల నుండి కోదాడకు విద్య, వైద్యం, ఉపాధి కోసం వచ్చి వెళ్తుతుంటారని తెలిపారు. ఈ క్రమంలో రోడ్డు దాటేటప్పుడు వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని వందలాది మంది చనిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నుండి బయల్దేరిన వ్యక్తి ఈ రహదారి దాటి ఇంటికి వచ్చే వరకు గ్యారెంటీ లేదని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.

గతంలో కూడా ఫ్లై ఓవర్ నిర్మించాలని పలుమార్లు ఆందోళనలు చేసినప్పటికి పట్టించుకోలేదన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి చొరవ చూపి బైపాస్



రోడ్డుపై ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరారు. వందలాది మంది మహిళలు, పురుషులు రోడ్డుపై బైఠాయించడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న సీఐ శివశంకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వటంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రాయబారపు వెంకటేశ్వర్లు, పాయలు కోటేశ్వరరావు, గిద్దె రాజేశ్, వివిధ పార్టీల నాయకులు, మాజీ సర్పంచ్ నిగడాల వీరయ్య, తిపిరిశెట్టి సత్యమయ్య చారి, సందీప్, అయినాల ఉపేందర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, తిప్పిరిశెట్టి వీరయ్య, రాయబారపు రాజేశ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతల వేధింపులతో అమాయకులు బలికావడం బాధాకరం: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సత్యమేవ జయతే – రంగారెడ్డి రంగారెడ్డి: కాంగ్రెస్ పార్టీ నాయకుల వేధింపులతో అమాయకులు బలికావడం బాధాకరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో డివిజన్ల కార్పొరేటర్లతో ఎమ్మెల్యే కృష్ణారావు సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ వేధింపుల వల్ల బోరబండ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్దార్ ఆత్మహత్య చేసుకోవడం ఎంతో కలిసి వేసిందని తెలిపారు. గత కొన్ని నెలలుగా సర్దార్‌ను పలు రకాలుగా వేధిస్తున్నారని, అన్నివైపులా వేధింపులు ఎక్కువ కావడంతో తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశాడు. రెండున్నర ఏళ్ల వయసున్న పిల్లలు, భార్య అనాథగా మారడం బాధాకరమని అన్నారు. అమాయకులను వేధిస్తూ రాక్షసుల్లా పీడిస్తున్న ఇలాంటి నాయకులను క్షమించరాదని ప్రజలు కూడా వీరి అరాచకాలను గమనిస్తున్నారని తొందరలోనే వీరి అరాచకాలకు ముగింపు పలికే రోజు వస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో 10 సంవత్సరాలు అధికారాన్ని అనుభవించి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకులే ఈ అరాచకాలకు పాల్పడుతున్నారని, పీసీసీ అధ్యక్షుడు ఇలాంటి వారిని గమనించాలని కోరారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చిన్న మధ్య తరగతి కుటుంబాలు ఇల్లు కట్టుకుంటే స్వాగతించామని.. కానీ నేడు సోమవారం వచ్చిందంటే చాలు ప్రజావాణికి కాంగ్రెస్ పార్టీ నాయకులే వెళ్లి బిల్డింగులపై ఫిర్యాదులు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతూ..



నిర్మాణదారుల వద్ద డబ్బులు దండుకోవడం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సర్దార్ మృతికి కాంగ్రెస్ పార్టీయే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

– ఫతేనగర్ బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టాలి%ా

%ఫతేనగర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేయడం వల్లే గతంలో బ్రిడ్జి నిర్మాణం కోసం మాజీ మంత్రి కేటీఆర్ నిధులు కేటాయించడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే బ్రిడ్జి కూలి ఇద్దరికి గాయాలయ్యాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బ్రిడ్జి, అండర్‌పాస్ నిర్మాణ పనులను చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో బ్రిడ్జి వద్ద ప్రజలతో కలిసి ధర్నా చేస్తానని హెచ్చరించారు.

ప్రజలకు అండగా ఉండాలి%ా.

%కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజలను వేధిస్తున్నారని, వారి ఆగడాలను అడ్డుకుంటూ ప్రజలకు అండగా నిలబడాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నేతలకు సూచించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ఎలాంటి అరాచకాలు జరగలేదని, నిరుపేదలకు అండగా ఉన్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతల తీరుతో ప్రజలు విసుగెత్తి పోయారని, నిత్యం అందుబాటులో ఉండి వారికి అండగా నిలబడి ధైర్యం చెప్పాలని కోరారు.

## ఇబ్బందుల్లేకుండా రేషన్ బియ్యం అందించాలి.. డీలర్లకు అదనపు కలెక్టర్ ఆదేశాలు



సత్యమేవ జయతే – మేడ్చల్ మేడ్చల్ : సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా రేషన్ బియ్యం అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. రేషన్ షాపుల్లో మూడు నెలలకు సరిపడే సన్నబియ్యం ఒకేసారి పంపిణీపై రేషన్ డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారులకు వచ్చే నెల 1వ తేదీ నుంచి జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, డీలర్లను ఆదేశించారు. రేషన్ షాపులు ఉదయం, సాయంత్రం తప్పక సమయపాలన పాటించాలని సూచించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, ఇతర వసతులను కల్పించాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూడాలని, సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.



## స్మశాన వాటికకు స్థలం కేటాయించిన తర్వాతే మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టండి



సత్యమేవ జయతే – కోడంగల్ కొడంగల్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో మెడికల్ కాలేజ్ నిర్మాణాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామ శివారులో మెడికల్ అండ్ వెటర్నరీ కళాశాల నిర్మాణం కోసం 60 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. మెడికల్ కాలేజీకి కేటాయించిన భూమిలో స్మశానవాటిక ఉందని, ఊరికి స్మశానం లేకపోతే ఎలా అంటూ గ్రామస్తులు నిలదీశారు. స్మశానవాటికకు 5 ఎకరాలను కేటాయించిన తరువాతనే కాలేజీ నిర్మాణం మొదలుపెట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.అప్పాయిపల్లి గ్రామ సమీపంలో నీ 19 సర్వే నెంబర్‌లో మెడికల్ అండ్ వెటర్నరీ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం తీసుకున్న 60 ఎకరాలలో భూమిలో మెడికల్ కళాశాల భూమికి ఆనుకొని స్మశాన వాటిక ఉంది. స్మశాన వాటికకు ప్రత్యేకంగా ఐదు ఎకరాలు కేటాయించిన తర్వాతనే మెడికల్ కళాశాల పనులు ప్రారంభించాలని మెడికల్ కళాశాల పనులకు గ్రామస్తులు అడ్డుకున్నారు. ప్రస్తుతం స్మశాన వాటిక గ్రామానికి ఆనుకుని ఉందని ముమ్ముందు గ్రామం మరింత విస్తరించినప్పుడు స్మశాన వాటిక ఇబ్బందులు తలెత్తె అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో మెడికల్ కాలేజ్ నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్తులువికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామ శివారులో మెడికల్ %డ% వెటర్నరీ కళాశాల నిర్మాణం కోసం 60 ఎకరాలను సేకరించిన ప్రభుత్వంమెడికల్ కాలేజ్ భూమిలో స్మశానవాటిక ఉందని, ఊరికి స్మశానం లేకపోతే ఎలా

## ప్రైవేటు పాఠశాలలో చదువు కోసం డబ్బులు వృథా చేసుకోవద్దు..

## పేరెంట్స్‌కు రాయపోల్ ఎంఈవో సూచన

సత్యమేవ జయతే – సిద్దిపేట సిద్దిపేట : సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో సత్యనారాయణ రెడ్డి శుక్రవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ పుస్తకాలను ప్రతి విద్యార్థికి పాఠశాల ఓపెనింగ్ రోజే అందేవిధంగా చూడాలని ఆదేశించారు.ప్రతి ఉపాధ్యాయుడు బడిబాటలో పాల్గొనాలని ఎంఈవో సత్యనారాయణరెడ్డి సూచించారు. విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా ప్రభుత్వ బడి అంటే ఇష్టపడేలా అవగాహన కల్పించాలన్నారు. పేదవాళ్లు డబ్బులను వృథాగా ప్రైవేటు పాఠశాలలకు పెట్టి ఇబ్బందులకు గురికావద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అనేక సౌకర్యలతో కూడిన విద్య అందుతుందని తెలిపారు.

## ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి : శ్రవణ్‌కుమార్



సత్యమేవ జయతే – నల్గొండ నల్గొండ : కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల కాల్చివేతను వెంటనే నిలిపివేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ నకిరేకల్ 7వ మండల మహాసభ పాల్వాయి విద్యాసాగర్ అధ్యక్షతన పట్టణంలోని స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం 2026 మార్చి నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని ప్రకటించడం దేశ పౌరులను హత్య చేయడమేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గౌని లక్షీనర్సయ్య, సహాయ కార్యదర్శి పాల్వాయి విద్యాసాగర్, నాయకులు జంగయ్య, లక్ష్మారెడ్డి, భద్రయ్య పాల్గొన్నారు.

## పవర్‌లూమ్ కార్మికుడికి చేయూత





సత్యమేవ జయతే – నల్గొండ నల్గొండ : పవర్‌లూమ్ కార్మికుడు అనుమాల శ్రీనివాస్ బ్రతుకుదెరువు కోసం సిరిసిల్ల నుండి పద్మనగర్ నల్లగొండకు వచ్చాడు. ఇక్కడ కూడా పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేశాడు. కాగా పక్షవాతంతో అనారోగ్యం పాలయ్యాడు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాడు. ఇతనికి పక్షవాతంకు సంబంధించిన మందులు నల్లగొండ జిల్లా సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ మూడు నెలలకు సరిపోను మందులు రూ.10,500 ఇప్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కర్నాటి యాదగిరి, ఉపాధ్యక్షుడు గంజి రామలింగం, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి మురళి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, పద్మశాలి సంఘం నాయకులు పున్న రమేశ్, వనం చంద్రశేఖర్, మూడా వేణు పాల్గొన్నారు.

## ఇంటి నెంబర్లు మిస్సింగ్.. పంచాయతీల్లో ఉన్న నెంబర్లు మున్సిపాలిటీ అయ్యాక కన్పించని వైనం





సత్యమేవ జయతే – మేడ్చల్ మేడ్చల్ : గ్రామ పంచాయతీల్లో ఇంటి నెంబర్లు అదృశ్యం అయ్యాయి. ఎన్నో ఏండ్ల పాటు తమకు ఇచ్చిన నెంబరుపై ఆస్తి పన్ను చెల్లించనప్పటికీ మున్సిపాలిటీకి వచ్చే వరకు ఆ నెంబర్ల కన్పించడం లేదు. ఇదేమిటని అడిగితే మళ్లీ నెంబర్లు తీసుకోవాలని అధికారులు చెపుతున్నారు.

వివరాల్లోకి వెళితే.. నాగారం మున్సిపాలిటీలో ఇటీవల ప్రభుత్వం కీసర మండలంలోని గోధుమకుంట, కరీంగూడ, రాంపల్లి దాయర, భోగారం గ్రామాలను విలీనం చేసింది. పంచాయతీల్లో ఉన్నప్పుడు ఆయా గ్రామాల్లో నిర్మించుకున్న ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయించారు. పంచాయితీల్లో అసెస్‌మెంట్ చేసిన ప్రకారం పన్నులు కూడా చెల్లిస్తూ వచ్చారు అయితే గ్రామాలు మున్సిపాలిటిలో విలీనం అయిన తర్వాత మాత్రం కొన్ని ఇంటి నెంబర్లు మున్సిపాలిటీల్లో కనిపించడం లేదు. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామ సర్పంచ్‌లు నకిలీ రశీదులు ముద్రించి, ఇండ్ల యాజమానులు చెల్లించిన డబ్బులను స్వాహా చేసి ఉంటారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులను ఇంటి నెంబర్ల అదృశ్యంపై అడిగితే ఆన్‌లైన్ కన్పించకపోతే మళ్లీ ఇంటి నెంబరు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. పన్ను కట్టేందుకు పలువురు ఇంటి యజమానులు ఆన్‌ల్కైన్‌లో చూడగా కనినిపించపోవడంతో అయోమయానికి గురై మున్సిపాలిటీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కొంత మంది అయితే మళ్లీ ఇంటి నెంబరు తీసుకొని, అసెస్‌మెంట్‌లు చేయించుకోగా మరికొంత మంది మాత్రం చెల్లించిన రశీదులను అధికారుల వద్దకు తీసుకెళ్లి, మళ్లీ ఇంటి నెంబరు ఎందుకు తీసుకుంటామని వాగ్వాదానికి దిగుతున్నారు.

గోధుమకుంట గ్రామ పరిధిలోని శివసాయి ఎన్‌క్లేవ్‌లో దాదాపు 20 వరకు ఇంటి నెంబర్లను కనిపించడం లేదు. ఆ వెంచర్‌లోని వారు మధ్య దళారులను పెట్టుకొని, ఇంటి నెంబరు తీసుకొని, ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్టు సమాచారం. ఇదిలా ఉంటే గతంలో పంచాయతీ కార్యదర్శుల నిర్వాకం కారణంగా ఆన్‌లైన్‌లో నమోదు కాకపోతే, ఇప్పుడు మున్సిపాలిటీల్లో నెంబరులేని వారిని గుర్తించి, నెంబర్ల కేటాయించాల్సిన అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, ఇంటి నెంబరు లేని వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నెంబరు కేటాయించాలని చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# పేదల వైద్య సేవలకు సహకారం : ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



సత్యమేవ జయతే – సికింద్రాబాద్ సికింద్రాబాద్ : పేదల వైద్య సేవలకు సహకారం అందిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన లాలాగూడ నివాసి వసంత, తుకారం గేట్ నివాసి మణెమ్మలు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఎమ్మెల్యేకు సమాచారం అందింది. ఈ క్రమంలో వారికి రూ. మూడు లక్షల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి లెటర్ అఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సీ) పత్రాలను, చెక్కులను సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శు క్రవారం అందించారు.

ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. నిరుపేదలు వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు అత్యవసర సందర్భాల్లో సీతాఫల్‌మండిలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నాని పేర్కొన్నారు. నిమ్స్ ఆసుపత్రిలో రోగులు చికిత్స పొందేందుకు వీలుగా ఈ పత్రాలను అందించామని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు.

# అప్పు పుడతలేదన్న మీకు.. హిమాచల్‌లో ప్రాజెక్టు కట్టేందుకు 6200 కోట్లు ఎక్కడి నుంచి వస్తాయి..



## సీఎం రేవంత్‌ను నిలదీసిన హరీశ్‌రావు

సత్యమేవ జయతే – హైదరాబాద్

హైదరాబాద్ : కూట్లో రాయి తీయని వాడు ఏట్లో రాయి తీసినట్టుంది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడం చేతకాని అసమర్థ రేవంత్ సర్కారు.. హిమాచల్ ప్రదేశ్‌లో హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకోవడం మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపంగి నూనె అనే సామెతను గుర్తు చేస్తోందని విమర్శించారు. అప్పులు పుట్టడం లేదని, తమను ఎవరు నమ్మడం లేదని ప్రతీ వేదిక మీద తన చేతకానితనాన్ని ప్రదర్శిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రూ.6200 కోట్లతో హిమాచల్ ప్రదేశ్‌లో తెల్ల ఏనుగులాంటి హైడల్ ప్రాజెక్టు నిర్మాణానికి టీజీ జెన్‌కోను రంగంలోకి దింపడం తుగ్లక్ చర్య తప్ప మరొకటి కాదని అన్నారు.హిమాచల్ ప్రదేశ్‌లో హైడల్ ప్రాజెక్టు నిర్మాణ పనుల నుంచి మోసర్ బేర్ వంటి ప్రతిష్టాత్మక కంపెనీ పారిపోయినా, ఎన్టీపీసీ లాంటి కేంద్ర ప్రభుత్వరంగ కంపెనీ మూడేండ్ల తర్వాత సాధ్యం కాదని వదిలేసిన 510 మెగావాట్ల ప్లాంట్ ని కట్టేందుకు టీజీ జెన్ కో ఒప్పందం ఎందుకు చేసుకుందో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాల కాలంలో ఒక్కరు కూడా కట్టేందుకు ముందు రాని ప్రాజెక్ట్‌ను ఎందుకు నేడు తెలంగాణ ప్రభుత్వం చేపట్టాల్సి వస్తోందని నిలదీశారు. డీపీఆర్ లేకుండానే తెలంగాణ ప్రభుత్వం హిమాచల్ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకొని అప్ ఫ్రంట్ ప్రీమియం కింద 26 కోట్ల రూపాయలు చెల్లించి మరో 26 కోట్ల రూపాయలు చెల్లించేందుకు సిద్ధపడటాన్ని బట్టి తెలంగాణ ప్రభుత్వం దివాలా తీసిందని సీఎం రేవంత్ రెడ్డి చెపుతున్న మాటలు ప్రజల చెవుల్లో పూలు పెట్టడానికేనని తేలిపోయాయని చెప్పారు.

‘ 2009లోనే మోసర్ బేర్ కంపెనీ 64 కోట్ల అప్ ఫ్రంట్ ప్రీమియం చెల్లించి హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రతిపాదిత సేలి, మియార్‌లో హైడ్రో పవర్ ప్రాజెక్టులు కట్టాలని భావించింది. కానీ సాంకేతికంగా, ఆర్థికంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం సాధ్యం కాదని చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. అనంతరం తాము చెల్లించిన 64 కోట్ల ప్రీమియంని హిమాచల్ ప్రభుత్వం తిరిగి ఇవ్వనందుకు గాను ఆ రాష్ట్ర హై కోర్టును ఆశ్రయించింది. ‘ హరీశ్‌రావు తెలిపారు. హిమాచల్ హైకోర్టు మోసర్ బేర్ కంపెనీకి వడ్డీతో సహా తీసుకున్న డబ్బును 2023 జనవరిలోనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. 10 గ్యారెంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయలేక చేతులెత్తేసిన కాంగ్రెస్ హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఢిల్లీలోని హిమాచల్ భవన్‌ను వేలం వేసి ఆ డబ్బుని కంపెనీకి చెల్లించాలని 2024 నవంబర్‌లో హైకోర్టు ఆదేశాలు జారీచేసిందని చెప్పారు. 7 నెలలకు పైగా అత్యధికంగా మంచు కురిసే ప్రాంతంలో హైడ్రల్ పవర్ ప్రాజెక్ట్ సాధ్యం కాదని 2019లో ఒప్పందం చేసుకున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎన్టీపీసీ కూడా చేతులు ఎత్తేసి ఒప్పందాన్ని రద్దు చేసుకుందని అన్నారు. అలాంటి అనువు కాని ప్రాంతంలో 6,200 కోట్ల రూపాయల ప్రాథమిక అంచనాతో 510 మెగా వాట్ల హైడ్రల్ ప్రవర్ ప్రాజెక్టులకు ఎందుకు రేవంత్ రెడ్డి సర్కారు ఉబలాటపడుతుందో శ్వేతపత్రం విడుదల చేయాలని భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు. ఫీజిబిలిటీ రిపోర్టులు, డీపీఆర్ లు లేకున్నా, జెన్ కో బోర్డు ఆమోదం లేకున్నా కూడా ఎంవోయూ చేసుకొని 26 కోట్ల రూపాయలు ఎందుకు చెల్లించారో తెలంగాణ ప్రజలకు చెప్పాలని, అసెంబ్లీలో చర్చించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రెండు కాంగ్రెస్ ప్రభుత్వాల మధ్య జరుగుతున్న గూడుపుఠాణి ఏందో గల్లీ కాంగ్రెస్ చెప్తుందా? ఢిల్లీ కాంగ్రెస్ చెప్తుందా? హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ చెప్తుందా? అని ప్రశ్నించారు. సాధ్యం కాదు అని 20 ఏండ్లుగా కట్టని ప్రాజెక్టును ఎవరి లాభం కోసం, ఎవరి మెప్పు కోసం కడుతున్నారో తెలంగాణ ప్రజలకు చెప్పాలని నిలదీశారు.

రైతు రుణమాఫీకి డబ్బు లేదంటారు.. రైతు బంధుకు డబ్బు లేదంటారు.. రైతు బీమాకి డబ్బు లేదంటారు.. ఆసరా పెన్షన్ కి డబ్బు లేదంటారు.. మహాలక్ష్మి కింద నెలకు 2500 రూపాయలు ఇచ్చే పథకానికి డబ్బు లేదంటారు.. తులం బంగారానికి డబ్బు లేదంటారు.. విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్‌కు డబ్బు లేదంటారు.. విద్యా భరోసాకి డబ్బు లేదంటారు.. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్‌లకు డబ్బు లేదంటారు.. ఉద్యోగుల డీఏలకు, పీఆర్సీకి దిక్కు లేదంటారు.. చివరికి అప్పు కూడా పుడుతలేదని అన్న రేవంత్ రెడ్డికి హిమాచల్‌లో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్ట్ కు 6,200 కోట్లు ఎక్కడ నుంచి వస్తాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని నిర్దిష్టమైన సమాచారం తమ వద్ద ఉందని.. త్వరలోనే కాంగ్రెస్ అవినీతి బండారాన్ని పూర్తి ఆధారాలతో బయటపెడతామని స్పష్టం చేశారు.

## ఉపాధి హామీ పెండింగ్ 8 వారాల డబ్బులు వెంటనే ఇవ్వాలి రోజు కూలి 307 నుండి 600 వరకు రోజు కూలి పెంచాలి. సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్.





సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా. ఇందిరమ్మ ఇండ్లు పార్టీలకు అతీతంగా అందరికీ ఇవ్వాలి ప్రతి ఊరికి 100 చొప్పున ఇండ్లుఇవ్వాలి సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యా%శీ%లో కలెక్టర్ కార్యాలయం ముందు శు క్రవారం వికారాబాద్ జిల్లాలో పెండింగ్ లో ఉన్న డబల్ బెడ్ రూమ్ లు వెంటనే పూర్తి చేసి పేదలకు పంచాలి ప్రభుత్వ, ఫారెస్ట్ భూములలో సాగులో ఉన్న పేదలకు పట్టాలు ఇవ్వాలి గ్రామాల్లో పెండింగ్లో ఉన్న రోడ్లు డ్రైనేజీలు కరెంటు సమస్యలు వెంటనే పరిష్కరించాలి మున్సిపల్ పట్టణాల్లో పెండింగ్లో ఉన్న మార్కెటూ షెడ్లను వెంటనే పూర్తి చేయాలి మండల కేంద్రాల మధ్యన పెండింగ్లో ఉన్న రోడ్లు వెంటనే పూర్తి చేయాలి తాండూర్, కొడంగల్ ప్రాంతంలో పెండింగ్ లో ఉన్న భూ నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి పెండింగ్ లో ఉన్న కాంపౌండ్ వాళ్ళు, బిల్డింగులు వెంటనే పూర్తి చేయాలి ఈ ప్రభుత్వం ఏర్పడి 2ఏండ్లు గడుస్తున్న పేదలకు ఇచ్చిన హామీలు అమలు చెయ్యలేదు వెంటనే అమలు చెయ్యాలి. లేనిచో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం వెంకటయ్య ,సిపిఎం జిల్లా నాయకులు సుదర్శన్ సతీష్, శ్రీనివాస్ చెంద్రయ్య బుగ్గన్న ప్రజా సంఘాల నాయకులు రైతు సంఘం నాయకులు చంద్రయ్య లక్ష్మయ్య మల్లయ్య సంగయ్య విజయ్ కుమార్ సినివాస్ రఘు రామ్ సత్తయ్య నర్సింలు లాలయ్య తదితరులు పాల్గొన్నారు

# అత్యధికంగా విదేశీ విద్యార్థులున్న అమెరికా వర్సిటీ ఇదే!

### ఇటీవల హార్వర్డ్ పై కఠినంగా వ్యవహరించిన ట్రంప్

### అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థుల్లో ఆందోళన

### అంతర్జాతీయ విద్యార్థుల శాతంపై కీలక సమాచారం వెల్లడి

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హార్వర్డ్ వర్సిటీ విషయంలో చేసిన వ్యాఖ్యలతో అగ్రరాజ్యంలో విద్యను అభ్యసిస్తున్న విదేశీ విద్యార్తుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో, అమెరికాలోని ప్రఖ్యాత వర్సిటీల్లో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థుల శాతంపై సమాచారం విడుదలైంది. అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాలు విదేశీ విద్యార్థులపై గణనీయంగా ఆధారపడుతున్నాయని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉన్నత విద్య కోసం వివిధ దేశాల నుంచి అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతుండగా, కొన్ని యూనివర్సిటీలలో వారిదే పైచేయిగా కనబడుతోంది. నేషనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ స్టాటిస్టిక్స్ (ఎన్‌సీఈఎస్) మరియు కార్నెగీ క్లాసిఫికేషన్ విడుదల చేసిన సమాచారం ప్రకారం, ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఇల్లినాయిస్ టెక్) అత్యధికంగా 51 శాతం అంతర్జాతీయ విద్యార్థులతో అగ్రస్థానంలో నిలిచింది. అంటే, ఈ యూనివర్సిటీలో సగానికి పైగా విద్యార్థులు విదేశీయులే కావడం గమనార్హం.ఇల్లినాయిస్ టెక్ తర్వాతి స్థానాల్లో కార్నెగీ మెలన్ యూనివర్సిటీ (44%), స్టీవెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (42%) ఉన్నాయి. నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, న్యూ స్కూల్, కొలంబియా యూనివర్సిటీలలోనూ అంతర్జాతీయ విద్యార్థుల వాటా 40 శాతంగా నమోదైంది. ప్రఖ్యాత జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీలో 39 శాతం, న్యూయార్క్ యూనివర్సిటీ (ఎన్‌వైయూ)లో 37 శాతం, క్లార్క్ యూనివర్సిటీలో 34 శాతం మంది విదేశీ విద్యార్థులు చదువుకుంటున్నారు.ఈ జాబితా కేవలం కొన్ని యూనివర్సిటీలకే పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన హార్వర్డ్ యూనివర్సిటీలో 28 శాతం, కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కాల్‌టెక్)లో 32 శాతం, యూనివర్సిటీ ఆఫ్ చికాగోలో 31 శాతం, బోస్టన్ యూనివర్సిటీలో 30 శాతం, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో 30 శాతం మంది అంతర్జాతీయ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు.ఈ గణాంకాలు అమెరికాలోని పలు ఉన్నత విద్యాసంస్థలు అంతర్జాతీయ విద్యార్థులకు ఎంతగా ప్రాధాన్యతనిస్తున్నాయో తెలియజేస్తున్నాయి. సాంస్కృతిక వైవిధ్యం, విభిన్న ఆలోచనా దృక్పథాలు, పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలకు ఈ పరిణామం దోహదం చేస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో, ఈ యూనివర్సిటీలు విదేశీ విద్యార్థుల నుంచి వచ్చే ఫీజులపై కూడా ఆధారపడుతున్నాయనే విశ్లేషణలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ, అమెరికా విద్యావ్యవస్థలో అంతర్జాతీయ విద్యార్థుల పాత్ర కీలకమని ఈ డేటా స్పష్టం చేస్తోంది.

## ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలి.. కలెక్టర్ ఆదేశాలు



సత్యమేవ జయతే – మెదక్ మెదక్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. పాపన్నపేట మండల పరిధిలోని మిన్పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం నాడు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లు ఇప్పటికే ఆలస్యమయ్యాయని.. వెంటనే కొనుగోళ్లు పూర్తిచేసి, వెంటవెంటనే లారీల్లో పంపించాలని ఆదేశించారు.

మిన్పూర్‌లో ధాన్యం బస్తాలను వెంటవెంటనే పంపకపోవడం పట్ల నిర్వాహకులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రాయపోల్ మండల పరిధిలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు దగ్గర పడ్డాయని కేవలం మిన్పూర్, కొండపాక. ముద్దాపూర్ గ్రామాలలో వెనుకబడినట్లు ఆయన వెల్లడించారు. ఒకవేళ అనుకున్న విధంగా లారీలు అందుబాటులో లేకపోతే మరిన్ని లారీలు తెప్పించుకొని రైతులకు ఏమాత్రం ఇబ్బందులు ఎదురవకుండా ధాన్యాన్ని తరలించాల్సిందిగా కలెక్టర్ సూచించారు. రైతులకు ఇబ్బందులు ఎదురవకుండా ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేయాలన్నారు.

## ఆపరేషన్ కగార్ పేరిట బీజేపీ దుశ్చర్య : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సత్యమేవ జయతే – మంచిర్యాల మంచిర్యాల : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట దుశ్చర్యలకు పాల్పడుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. శుక్రవారం మంచిర్యాలలో పర్యటించిన ఆమె మీడియాతో మాట్లాడారు.

మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందితే కనీసం మానవత్వాన్ని చూపించకుండా, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా బీజేపీ సంస్కారాన్ని కోల్పోయిందని విమర్శించారు. కగార్‌ను ఆపాలని పదేపదే కోరినా స్పందించకుండా మారణకాండను కొనసాగించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు .

ఇటీవల నిర్వహించిన సరస్వతి పుష్కరాల్లో స్థానిక ఎంపీ గడ్డం వంశీని ఆహ్వానించకపోవడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. గతంలో యాదగిరిగుట్టలో కూడా రేవంత్ రెడ్డి కుటుంబాన్ని ఆసనాలలో కూర్చుండబెట్టి , డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను కింది ఆసనాలలో కూర్చోబెట్టి అవమానించారని దుయ్యబట్టారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు మునీర్ కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు .

## కొత్తగూడెం పోలీసుల ఎదుట 17 మంది మావోయిస్టులు లొంగుబాట






సత్యమేవ జయతే – కొత్తగూడెం కొత్తగూడెం : మావోయిస్టు పార్టీకి చెందిన 17 మంది సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు శుక్రవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మావోయిస్టు పార్టీ కాలం చెల్లిన సిద్ధాంతాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నాయకులు, సభ్యులు వరుసగా లొంగుబాటు మార్గాన్ని ఎంచుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో భాగంగానే జిల్లా పోలీసుల ఎదుట ఆరుగురు మహిళా సభ్యులతో సహా 17 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు చెప్పారు.

లొంగిపోయిన వారిలో ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు, నలుగురు పార్టీ సభ్యులు, 11 మంది మిలీషియా సభ్యులు ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 282 మంది మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులు లొంగిపోయినట్లు వివరించారు. వారిలో ఒక డీవీసీఎం, 13 మంది ఏరియా కమిటీ/ పీపీసీ సభ్యులు, 32 మంది పార్టీ సభ్యులు, 105 మంది మిలీషియా సభ్యులు, 33 మంది ఆర్పీసీ సభ్యులు, 47 మంది డీఏకేఎంఎస్/ కేఏఎంఎస్, 30 మంది చైతన్య నాట్యమండలి, 21 మంది గ్రామ రక్షక దళ సభ్యులు ఉన్నట్లు వెల్లడించారు. ఇటీవల ములుగు జిల్లా పోలీసులు 20 మంది మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి 12 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మిగతా మావోయిస్టులంతా అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం మావోయిస్టులకు ప్రోత్సాహక నగదు చెక్కులను ఎస్పీ అందజేశారు. ఈ సమావేశంలో కొత్తగూడెం అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) గోపతి నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, 141వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ప్రీతా, 81వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ రవిశర్మ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, చర్ల సీఐ రాజు వర్మ, ఆర్ఐ (ఆపరేషన్స్) రవి పాల్గొన్నారు.

## గోబెల్స్ కూడా సిగ్గుపడేలా అబద్ధాలు.. హైదరాబాద్‌పై చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించిన జగదీష్ రెడ్డి



సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : ఆంధ్రా మహానాడులో తెలంగాణ ముచ్చటెందుకని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. గోబెల్స్ కూడా సిగ్గుపడేలా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. మహానాడులో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. 2004తోనే తెలంగాణలో చంద్రాబాబు చరిత్ర ముగిసిందని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధి ఆయన వల్లే జరిగిందంటే నవ్వొస్తుందంటూ ఎద్దేవా చేశారు. 2004లో సమైక్య ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ.26 వేల లోపేనని స్పష్టం చేశారు. 2014 నుంచి ఆంధ్రలో మీ ఐదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధి ఒక్కసారి గుర్తుచేసుకోవాలంటూ చరకలంటించారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని చెప్పారు. అన్నిరంగాలు అభివృద్ధిలో దూసుకుపోయాయని వెల్లడించారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన సమయంలో తెలంగాణాలో రూ.1.12 లక్షల తలసరి ఆదాయముంటే.. కేసీఆర్ పాలనలో రూ.3.70 లక్షలకు చేరిందన్నారు. ఇప్పటికి కూడా ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయ రూ.2.50 లక్షలు మాత్రమేనని వెల్లడించారు. నిజంగా మీ పరిపాలన గొప్పదే అయితే ఏపీ ఆదాయం ఎందుకు పెరుగుతలేదని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ మీద ఆయనకు ప్రేమలేకన లేదా ఎప్పటికైనా హైదరాబాద్‌కు రావాల్సిందే కాబట్టి ఆంధ్రను వాడుకుని వదిలేద్దామనుకుంటున్నారా అని నిలదీశారు. చంద్రబాబు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితక్క కి స్వాగతం పలికిన దాసరి ఉష





సత్యమేవ జయతే – పెద్దపల్లి పెద్దపల్లి: శుక్రవారం రోజు మంచిర్యాల లో జరుగుతున్న వివాహానికి వెళ్తున్న సందర్భంగా వారికి పెద్దపల్లి పట్టణం లో అయ్యప్ప టెంపుల్ చౌరస్తా వద్ద ఆగి తదనంతరము తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేయడం జరిగింది ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత గారికి ఘనంగా స్వాగతం పలికిన పెద్దపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష గారుఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జెడ్పిటిసి లు, ఎంపిటిసి లు, కౌన్సిలర్ లు, వార్డ్ మేంబర్ లు,కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## మరోసారి మానవత్వాన్ని చాటుకున్న మంత్రి సీతక్క!



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.అధికారంలో లేనప్పుడే కాదు అధికారంలో ఉన్న కూడా తన శైలి మారదని మరోసారి నిరూపించుకు న్నారు మంత్రి సీతక్క, ఓ వాహన దారుని పట్ల మానవత్వం మరోసారి చాటుకున్నారు. మంత్రి సీతక్క...తన మానవత్వాన్ని మరోసారి చాటుతూ, అత్యవసర పరిస్థితిలో ఉన్న ఒక వ్యక్తికి వెంటనే సహాయం చేశారు. పంజాగుట్ట ఫ్లైఓవర్ ఒక వాహనదారుడు ప్రయాణి స్తున్న సమయంలో అకస్మాత్తుగా మూర్ఛకు గురై కిందపడిపోయాడు. అదే సమయంలో తన కాన్వాయ్ లో అటుగా వెళ్తున్న మంత్రి సీతక్క, ఆ దృశ్యాన్ని గమనించారు. వెంటనే స్పందించిన ఆమె, తన వాహనాన్ని ఆపాలని చెప్పి వాహనం దిగి, ఆ వ్యక్తి వద్దకు చేరుకున్నారు.ఆ వ్యక్తి స్పృహలోకి రాకుం డా ఉండడంతో, ఆయన చేతిలో తాళం చెవులు ఉంచి, తాను అక్కడే నిలిచి స్పృహలోకి వచ్చే వరకూ చూస్తూ ఉన్నారు. వెంటనే అతనికి వైద్య సహాయం అందించేందుకు సమీప ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.సాధారణంగా అధికారులు ఆదేశాలు ఇస్తే సరిపోతుం ది, కానీ మంత్రి హోదాలో ఉన్నప్పటికీ, సీతక్క స్వయంగా బాధితుడికి సహాయం చేయడాన్ని చూసిన వారంతా ఆమెపై ప్రశంసలు కురిపించారు..

# ధాన్యం కొనుగోలులో సర్కారు విఫలం

**సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే ధాన్యం కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటు**

**అందాల పోటీల పైన ఉన్న శ్రద్ధ.. రైతులపై ముఖ్యమంత్రికి లేదు.**

**వారంలోపు ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి.. లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తాం**

**జుంటుపల్లి లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శుభ ప్రద్. పటేల్....**





సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా వికారాబాద్ లో అన్నదాతలు అరి గోస పడుతున్నారని బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శుభప్రద్ పటేల్ మండిపడ్డారు. తాండూర్ నియోజకవర్గం యాలాల మండలం జుంటుపల్లి గ్రామంలో గ్రామంలో ఆయన పర్యటించి వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ యాసంగిలో వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అరకొర కొనుగోలు కేంద్రాలు సక్రమంగా కొనసాగడం లేదని తప్పు పట్టారు. కష్టించి పంటను పండించి..తేమ శాతం లేకుండా చేసేందుకు కల్లాల్లో ఆరబెట్టి స్థానికంగా ఉన్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి తీసుకెళ్లామంటే..అక్కడి సిబ్బంది సరిపడా గన్నీ బ్యాగు లు లేవని.. అవి వచ్చిన తర్వాతే ఇస్తామని.. అప్పటివరకు ధాన్యాన్ని కొనుగోలు చేయమని అధికారులు అనడం సరికాదన్నారు. మరోవైపు అకాల వర్షాలు అన్నదాతను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఉదయం వరకు ధాన్యాన్ని ఆరబెట్టగా.. సాయం త్రం సమయంలో వర్షం కురిసి తడిసిపోతుండడంతో అన్నదాత పరిస్థితి ఆందోళనక రంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ఆయన రైతుల పక్షాన డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డిది కేవలం రివ్యూలు తప్ప.. ఆచరణలో ఏమీ లేదన్నారు. ఈ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిది ఒక తీరు.. మంత్రులది మరో తీరు అన్నారు. సీఎం పక్క నియోజకవర్గంలోనే తీరు ఉంటే.. రాష్ట్రవ్యాప్తంగా తీరు ఎలా ఉందో దీన్ని బట్టి అర్థమవుతుందని ఆయన అన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం.. కల్లాల వద్ద పడిగాపులు.. అధికారులు ఎప్పుడు వస్తారో తెలియదు.. ఎప్పుడు ధాన్యం తరలిస్తారో తెలియనీ పరిస్థితి ఉందన్నారు. కల్లాలోనే మొలకెత్తుతున్న ధాన్యం కుప్పలు.. రైతుల గుండెల్లో కన్నీరు.. తుడిచేదెవరని ఆయన ప్రభుత్వానికి ప్రశ్నించారు. రైతు ఏడ్చిన రాజ్యం..ఎద్దు ఏడ్చిన వ్యవసాయం బాగుపడినట్లు చరిత్రలో లేదనీ ఆయన గుర్తు చేశారు. బోనస్, మద్దతు ధరకు ఆశపడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెస్తే తడిసి ముద్దయి మొలకెత్తడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారని శు భప్రత్ పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కాంటాలు పెట్టకపోవడంతో వర్షాలకు తడిసి మొలకెత్తడం జరుగుతోందన్నారు.

ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ధాన్యం తూకంలో కోత విధించొద్దని ఆయన కోరారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి తమ వడ్లను సరైన ధరకి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తా ప్రభుత్వానికి శుభప్రద్ పటేల్ ఘాటుగా హెచ్చరించారు..

# గ్రామ పరిపాలన అధికారుల పరీక్ష ఫలితాలు విడుదల.



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా...తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూ శాఖలో కొత్తగా 10,954, గ్రామ పాలన అధికారుల పోస్టులు మంజూరు చేశారు. గ్రామ పరిపాలనను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 10,954 మంది గ్రామ అధికారులను నియమించనుంది..

గత ప్రభుత్వం వీఆర్వో వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేయడం తో పాటు వీఆర్వో వీఆర్ఏలను ఇతర ప్రభుత్వ శాఖల్లో విలియం చేసింది, తాజాగా సీఎం రేవంత్ రెడ్డి, సర్కార్ మళ్లీ గ్రామ పరిపాలన అధికారు లను నియమించాలని నిర్ణయం తీసుకుంది...

ఇందుకోసం రెండు రోజుల క్రితం పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం శుక్రవారం జిపిఓ పరీక్ష ఫలితాలు విడుదల చేసింది,10,954 పోస్టులకు గాను 3,550 మంది ఎంపిక య్యారు.తెలంగాణ ప్రభుత్వం లోకి వెళ్లి ర్యాంకు లిస్టు చూసుకోవచ్చు..

ఎంపికైన వారిని జూన్ 2 వ తేదీన నియామక పత్రాలు అందించే అవకాశం ఉంది...

# అదనపు పోస్టులు సృష్టించి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయాలి : ఆర్.కృష్ణయ్య

సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : కొత్తగా ఏర్పడిన జిల్లాలు, మండల కార్యాలయాలకు అనుగుణంగా అదనపు పోస్టులు సృష్టించి తక్షణమే వాటిని భర్తీ చేసేందుకు కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. యువతరాన్ని నేరుగా రిక్రూట్‌మెంట్ ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలోకి తీసుకురావడంతో అవినీతికి తావులేకుండా సమర్థవంతమైన పాలన సాగించవచ్చని అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ విభాగాలలోని అన్ని పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఆరేళ్ల కిందట ఏర్పాటైన 23 జిల్లాల్లోని అన్ని విభాగాలలో ఇంచార్జీలతో ప్రభుత్వ పాలన ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. పాత పోస్టులు, అదనపు బాధ్యతలతో ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించడం సరికాదని అన్నారు. దీంతో ఉద్యోగులపై పనిభారం పడటం తప్పితే రాష్ట్రానికి, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని చెప్పారు. జిల్లా స్థాయిలో ఒక్కో అధికారిని మూడు నాలుగు విభాగాలకు ఇంచార్జీలుగా నియమిస్తే సజావుగా పనులు సాగవని చెప్పారు.

తెలంగాణలోని 23 జిల్లాల్లోని 40 శాఖలు, 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు ,76 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు, 4383 గ్రామపంచాయతీలతో పాటు అనేక పోలీస్ స్టేషన్లు ఏర్పడ్డాయని ఆర్.కృష్ణయ్య తెలిపారు. వీటన్నింటిలో అనేక రకాల పోస్టులు ఖాళీగానే ఉన్నాయని చెప్పారు. వీటిలోని గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–4లతో పాటు అన్ని సర్వీస్ పోస్టులను భర్తీ చేయడానికి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన



డిమాండ్ చేశారు. మెరిట్ అభ్యర్థులు అన్ని పోస్టులకు ఎంపికయ్యే అవకాశం ఉన్నందున ప్రస్తుత పద్ధతి ప్రకారం వెయిటింగ్ లిస్ట్, ఆప్షన్ విధానంతో కాల పరిమితితో పోస్టుల భర్తీ చేయాలన్నారు. దీంతో పోస్టులు మిగిలిపోకుండా అందరికీ అవకాశం వస్తుందన్నారు. అన్ని రకాల టీచర్ పోస్టులను సైతం ఆప్షన్ విధానంలోనే భర్తీ చేయాలని కృష్ణయ్య ప్రభుత్వానికి సూచించారు. యువతను పాలనరంగంలోకి తీసుకువస్తే ఉత్సాహంగా అంకితభావంతో నిజాయితీగా పనిచేస్తారని చెప్పారు. యువత శక్తి యుక్తులను సమాజాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు.

## ఎడిటోరియల్

# 'బంగ్లా'లో యూనస్ ధ్వంస రచన

ఒక రంగంలో లబ్ధప్రతిష్ఠుడైనంత మాత్రాన సదరు వ్యక్తి అన్ని రంగాల్లోనూ విశేషంగా రాణించగలడని చెప్పలేం. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్‌ను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అల్లర్లకు, రాజకీయ అస్థిరత్వానికి మారుపేరుగా నిలిచిన బంగ్లాదేశ్‌లో పుట్టిపెరిగిన యూనస్ మైక్రో ఫైనాన్స్ బ్యాంక్ ద్వారా సూక్ష్మరుణాలను అందజేసి లక్షలాది ప్రజలను పేదరికంనుంచి బయటపడవేసిన ఘనతను సొంతం చేసుకున్నారు. ఆయన కృషికి గాను సుమారు పాతికేళ్ల కిందట నోబెల్ శాంతి బహుమతి కూడా లభించింది. అయితేనేం, గత ఏడాది రిజర్వేషన్ల గలభా కారణంగా ప్రధాని షేక్ హసీనా పదవి పోగొట్టుకుని, భారత్‌కు పరారై వచ్చిన తర్వాత ప్రభుత్వ తాత్కాలిక సారథిగా పగ్గాలు చేపట్టిన యూనస్, గత తొమ్మిది నెలలుగా పాలనను పట్టాలెక్కించలేక పడరాని పాట్లు పడుతున్నారు.

మైక్రోఫైనాన్స్ బ్యాంకర్‌గా, ప్రొఫెసర్‌గా పేరొందిన ఈ పెద్దాయనకు పాలనానుభవం నాస్తి. రాజకీయానుభవం శూన్యం. ఫలితంగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ఇంటాబయటా వివాదాలకు కారణమవుతున్నాయి. అవామీలీగ్ అధినేత షేక్ హసీనాతో ఆయనకు గతంనుంచీ విభేదాలు ఉన్నాయి. నోబెల్ సంస్థ యూనస్‌కు శాంతి బహుమతి ఇచ్చినా, పేదలను రుణాల ఊబిలోకి నెట్టివేశారంటూ ఆయనను హసీనా బహిరంగంగానే విమర్శించేవారు. దీనికితోడు కార్మిక చట్టాలను ఉల్లంఘించారంటూ ఏణ్ణర్థం కిందట బంగ్లాదేశ్ కోర్టు యూనస్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. కాకతాళీయంగా ఆ సమయంలో అధికారంలో ఉన్నది షేక్ హసీనాయే కావడం ఇద్దరికీ మరింత దూరం పెరిగేందుకు దోహదపడింది.ఈ పరిణామాల నేపథ్యంలో యూనస్ ముందుగా హసీనాపైనా, ఆమె పార్టీపైనా గురిపెట్టారు. హసీనా ప్రధాన అనుచరులను అరెస్ట్ చేయించడంతో శాంతించకుండా ఏకంగా ఆమె పార్టీనే నిషేధించారు. పాకిస్తాన్‌లో బెంగాలీల స్వయం ప్రతిపత్తికోసం పోరాటం సల్పి, స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన, ఏడున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన అవామీలీగ్‌పై ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద వేటు వేయడం సహజంగానే లక్షలాది పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి కారణమైంది. పార్లమెంటు అనుమతి లేకుండా ఒక రాజకీయ పార్టీని ఎలా నిషేధిస్తారంటూ హసీనా ప్రశ్నించడంలో అర్థం లేకపోలేదు. మరోవైపు ఆమెకు ఆశ్రయం ఇచ్చిందన్న అక్కసుతో భారత్‌తో కోరి కయ్యానికి కాలు దువ్వుతున్నారు.స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భావంలో భారత్ పోషించిన పాత్ర ఎటువంటిదో ఆ దేశంలో ఎవరిని అడిగినా చెబుతారు. కానీ యూనస్ ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదు.భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలకు తామే దిక్కనే విధంగా చైనా గడ్డపైనుంచి ఆయన చేసిన ప్రకటన ఇరుదేశాల స్నేహ సంబంధాలను దెబ్బతీసింది. అంతటితో ఊరుకోకుండా ఇటీవల టగ్ బోట్ల నిర్మాణానికి భారత ప్రభుత్వ రంగ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని తెగతెంపులు చేసుకున్నారు. ఇందుకు ప్రతిగా బంగ్లాదేశ్ నుంచి పలు దిగుమతులపై భారత్ ఆంక్షలు విధించడంతో రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కూడా బలహీనపడ్డాయి. తాను తాత్కాలిక సారథినేనన్న విషయానికి విస్మరించి, నియంత పోకడలు పోతున్న యూనస్ వైఖరిపై బంగ్లాదేశ్‌లో నిరసనలు పెల్లుబుకుతున్నాయి. సకాలంలో ఎన్నికలు నిర్వహించి, ప్రజాప్రభుత్వానికి పాలనా పగ్గాలు అప్పగించవలసిన యూనస్, ఉద్దేశపూర్వకంగా ఎన్నికలను వాయిదా వేస్తున్నారని ఆ దేశ సైన్యాధ్యక్షుడు సైతం బహిరంగంగానే నిరసన వ్యక్తం చేయడం గమనార్హం.యితే, అవసరమైతే వీధిపోరాటాలకైనా సిద్ధమే తప్ప, ముందుగా ఎన్నికల నిర్వహణ వీలు కాదని యూనస్ మొండికేస్తున్నారు.వచ్చే ఏడాది ఆగస్టులోగాని ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వానికి సహకరించని అధికార యంత్రాంగం, సద్దుమణగని అల్లర్లు, పట్టాలెక్కని పాలన%౫% యూనస్ తాత్కాలిక ప్రభుత్వాన్ని వధ్యశిలపై నిలబెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేస్తున్నట్లు ఇటీవల పుకార్లు గుప్పుమనడంలో ఆశ్చర్యమేముంది? ఇవన్నీ నిజం కాదంటూ ప్రభుత్వం కొట్టిపారేసినా, ఎన్నికలు జరిగేంతవరకూ యూనస్ ప్రభుత్వం ఉంటుందా, ఊడుతుందా అనే సందేహం అందరిలోనూ నెలకొంది. ప్రపంచమంతా మెచ్చిన వ్యక్తికి అధికారం చేపట్టాక ఏమైంది? ఈ ప్రశ్న ఇప్పుడు బంగ్లాదేశ్‌లోని ప్రతి పౌరుడినీ వేధిస్తోంది. ఈ విషయంలో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ ఆత్మావలోకనం చేసుకోవడం మంచిది.

# జి.ఒ నెం. 3ను పునరుద్ధరించాలి



ఆదివాసీ సమాజాన్ని, ఆదివాసీ అస్తిత్వాన్ని, ఆదివాసీ ఆత్మగౌరవాన్ని అంతం చేసేందుకు ఏజెన్సీలోకి వలసవాదులు, గిరిజనేతరులు క్రమక్రమంగా ఏజెన్సీ హక్కులు, చట్టాలను కాలరాస్తూ అన్ని విధాలుగా కొల్లగొడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులకు దక్కవలసిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సైతం ఆక్రమిస్తూ ఆదివాసుల నోటి దగ్గర ఉన్న కూడు కూడా లాక్కుంటున్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఏజెన్సీ 5వ షెడ్యూల్ భూభాగంలో అడవి బిడ్డల హక్కులను, భూములను, రిజర్వేషన్లను దర్జాగా అనుభవిస్తున్నారు. ఏజెన్సీలో జి.ఒ నెం. 3 సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టును ఆశ్రయించి సామాజిక న్యాయాన్ని సమాధి చేశారు. ఆదివాసులు, అడవి బిడ్డలు నాగరికత సమాజానికి దూరంగా జీవిస్తూ అనుక్షణం దినదిన గండంగా తమ మనుగడ కోసం, అస్తిత్వం కోసం పోరాటం చేస్తున్న తరుణంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆనాటి ఆదివాసీల పోరాటాలను చూసి చలించిపోయి ఆదివాసీ ప్రాంతాల్లో ఆదివాసులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నారు.1986 సంవత్సరంలో జి.ఒ నెం. 275ను జారీ చేశారు. ఆదివాసీ, అడవి బిడ్డలకు 100% రిజర్వేషన్ అవకాశాన్ని కల్పిస్తూ మరో 18 జిఒలను కూడా జారీ చేశారు. నేటి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలు, తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలలో ఏజెన్సీ టీచర్లు, విఆర్ఒ, విఆర్ఎ, ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు, డిప్యూటీ సర్వేయర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఫారెస్ట్ ఆఫీసర్లు, పోలీస్ శాఖ, ఆశ్రమ పాఠశాల అసిస్టెంట్లు, వంట మనిషి, కమాటీ, వాచ్‌మెన్, స్వీపర్లు వివిధ ఉద్యోగాల్లో సుమారు 50 వేల మంది ఆనాటి ఆదివాసీ నిరుద్యోగ యువత ఉద్యోగాల ద్వారా లబ్ధి పొందారు. 1998వ సంవత్సరంలో జి.ఒ నెం. 275ను కొందరు వలసవాద గిరిజనేతరులు అక్రమంగా చట్టవిరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కోర్టులో కేసు వేసి రద్దు చేయించారు. 1998లో గిరిజన సంక్షేమ పరిషత్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 275 జిఒను పునరుద్ధరించాలని ఆదివాసీ సమాజం ఉవ్వెత్తున ఉద్యమాలను ఉధృతం చేశారు.ఆ ఉద్యమాలను చూసిన ఆదివాసులపై అభిమానంతో ఆనాటి జిల్లా కలెక్టర్ గిరిధర్ 275 జిఒ స్థానంలో మరో జిఒను రూపొందించాలని గిరిజన సంక్షేమ శాఖకు సిఫార్స్ చేశాడు. కలెక్టర్ సిఫారసులను పరిశీలించిన గిరిజన సంక్షేమ శాఖ 275 జిఒ స్థానంలోనే జి.ఒ నెం. 3ను 10-జనవరి- 2000 సంవత్సరం జారీ చేసింది. ఆదివాసీ సమాజంలో ఆదివాసులకు, ఆదివాసులచే విద్యని బోధించడం, నిరుద్యోగాన్ని తొలగించడం ముఖ్యఉద్దేశం. కానీ ఆచరణలో వలసవాదులైన లంబాడీలకే అత్యధిక ఉద్యోగాలు పొందిన చరిత్ర సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. ఫలితంగా ఆదివాసీ సమాజంలో ఉపాధి, ఉద్యోగలు ఇక పగటి కలగానే మారే అవకాశం ఉంది. ఆదివాసులకు 100% ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నప్పటికీ సగం చట్టవిరుద్ధంగా వలస వచ్చిన లంబాడీలు దోచుకున్నారు. ఏమాత్రం ఆదివాసులకు ఉపాధి, ఉద్యోగాలు వచ్చే అవకాశం లేకుండా పోయింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 343 (2) ప్రకారం వలసవాదులు, గిరిజనేతరులు ఏజెన్సీలో నివసించడానికి అవకాశం లేనప్పుడు అదే ఏజెన్సీలో ఉద్యోగాలు ఎలా చేస్తారో? ఆదివాసులకు ప్రస్తుతం పాలిస్తున్న రాజకీయ పార్టీలు, న్యాయస్థానాలు సమాధానం చెప్పాలి.సుప్రీం కోర్టు సమత జడ్జిమెంట్‌లో ఏజెన్సీలో కూడా ప్రభుత్వాన్ని గిరిజనేతరుడు గానే చూడాలని తీర్పు వెలువరించిన విషయం మర్చిపోయారా..? 2001న జి.ఒ నెం. 3 నీ సమర్థిస్తూ హైకోర్టు ఫుల్ బెంచ్ జడ్జిమెంట్ ఆదివాసులు కనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగింది. హైకోర్టు జడ్జిమెంట్‌ను సుప్రీం కోర్టులో గిరిజనేతరులైన బోడ వెంకటేశ్వర్లు, లీలా ప్రసాదులు సవాల్ చేశారు. 2002 సంవత్సరంలో జరిగిన సుప్రీం కోర్టు వాదనలు గిరిజనేతరులకు స్టే ఇచ్చుటకు నిరాకరించింది. సుప్రీం కోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలాలు చేయడం వల్ల 2000 సంవత్సరం నుండి 2008 వరకు ఏజెన్సీ డీఎస్సీలను యధావిధిగా కొనసాగించారు. గడిచిన రెండు దశాబ్దాల కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో 9 జిల్లాలలో సుమారు 2000 వేలకుపైగా ఆదివాసులు ఉపాధ్యాయులుగా నియామకాలు పొందారు.అనంతరం వలసవాదులు, గిరిజనేతరులు కుట్రలు కుయుక్తాలతో జి.ఒ నెం. 3ను సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే సుప్రీం కోర్టు 22 ఏప్రిల్ 2020న రద్దు చేయడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదివాసీ నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు అందనంత దూరంగా అడవులకు పరిమితం చేసింది. నాటి నుంచి నేటి వరకు ఆదివాసీ హక్కుల కోసం.. ఆత్మగౌరవం కోసం ఆదివాసీ ప్రజలు ఆగ్రహంతో అనేక ఉద్యమాలు పోరాటాలు కొనసాగిస్తూనే ఉన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్‌లో మా ఊర్లో మా రాజ్యం%౫% మా ఉద్యోగాలు మాకే కావాలి అంటూ ఆదివాసీ ఐక్య సంఘాల జెఎసి, ఆదివాసీ ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీల ఆధ్వర్యంలో మన్యంలో మరో పోరాటానికి సిద్ధమయ్యారు. బందులు, రాస్తా రోకోలు, నిరసనలు, రిలే నిరాహార దీక్షలు, రైల్ రోకోలతో ఉద్యమ ఆగ్రహ జ్వాలలు అలుముకున్నాయి. సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ సిఎం నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ ఏజెన్సీ ప్రాంతంలోని స్థానిక ఆదివాసులకే ఉద్యోగా అవకాశాలు కల్పిస్తామని గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అంతేకాదు సుప్రీం కోర్టు మార్గదర్శకాలను పాటిస్తూనే రద్దు అయిన జి.ఒ నం:3ను పునరుద్ధరించేందుకు చట్టపరమైన అడ్డంకులపై అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆదివాసీ ఆడబిడ్డ మంత్రి సీతక్క ఆదివాసీ బిడ్డగా చొరవ తీసుకొని తమ ఆదివాసీ బిడ్డల ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు అటు ప్రభుత్వం, ఇటు గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి తెలంగాణలో జి.ఒ నెం. 3కు పునర్జీవం పొయ్యాలని ఆదివాసీ నిరుద్యోగ యువకులు, విద్యార్థులు, ఆదివాసీ సమాజం కోరుకుంటుంది.

# మన కాలపు మహా రాక్షసుడు



%మనం ఒక మహా రాక్షసుని గురించి రెండవ ప్రపంచ యుద్ధ సందర్భంలో విన్నాము. తన గురించి చదవటం, వినటం, సినిమాలలో చూడటం తప్ప ఈ తరానికి ప్రత్యక్షంగా ఏమీ తెలియదు. ఆ రాక్షసుడు సుమారు 60 లక్షల మంది యూదులను, మరికొన్ని లక్షల మంది ఇతరులను నిలువునా ప్రాణాలు తీసాడు. ఆయన ప్రారంభించిన రెండవ ప్రపంచ యుద్ధంలో మొత్తంగా చనిపోయిన వారు, గాయపడిన వారు 5 కోట్లనుంచి 8 కోట్లకుపైగా ఉంటారని అంచనా. ఆ విధంగా మొత్తం మానవాళి చరిత్రలోనే అంతటి మారణహోమం ఎప్పుడూ జరగలేదు. మొదటి ప్రపంచ యుద్ధం సహా.ఇందులో ప్రస్తుత చర్చకు సంబంధించి యూదుల విషయం చెప్పుకోవాలి. వారిలో చిన్నా పెద్దా, మహిళలు, పిల్లలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ వెతికి వెతికి మరీ చంపించాడు ఆ రాక్షసుడు. తమ దేశంలోనే గాక, యుద్ధ క్రమంలో తాము ఆక్రమించిన ప్రతి ఒక్క దేశంలో. మొత్తం యూదు జాతినంతటినీ అంతం చేయగలనని బాహాటంగా ప్రకటించాడు.ఆ రాక్షసుడు ఎవరో చాలామందికి అర్థమయే ఉంటుంది. తన పేరు అడాల్ఫ్ హిట్లర్. దేశం జర్మనీ. ఆయన రాసిన తన ఆత్మకథ 'మీన్ కాంఫ్' (జర్మన్ భాషలో 'నా కథ'). దానిని కొందరు చదివే ఉంటారు. తనకు టీనేజ్ నుంచే యూదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టులంటే పరమ ద్వేషం. రాజకీయ పార్టీ నెలకొల్పిన తర్వాత అందుకు కార్యాచరణ రూపం వస్తుండగా, అధికారానికి వచ్చిన వెనుక ప్రత్యక్ష హత్యాకాండ మొదలైంది.ఈ ప్రస్తావనలన్నీ ఎందుకంటే ఆ విధంగా హిట్లర్ విద్వేషానికి, మారణహోమానికి బలైన యూదుల వారసుడు అయిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, హిట్లర్ జాతి విద్వేషాన్ని కూడా తనకు వారసత్వంగా తెచ్చుకుంటూ మనకాలపు మహా రాక్షసునిగా మారి, గాజాలో గత ఏడాదిన్నరగా 60 వేల మందికి పైగా పాలస్తీనా ప్రజలను కాల్చి చంపించాడు.

అందులో స్త్రీలు, పిల్లలు 80 శాతమని అంచనా. తక్కిన 20 శాతంలో అనేకులు వృద్ధులు. ఇది గాక, పాలస్తీనాలోని రెండవ భూ భాగమైన వెస్ట్ బ్యాంక్‌లో కొన్ని వందల మంది ప్రాణాలు తీసారు. ఇదంతా నేటికీ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా లెక్కలేనన్ని ఆస్పత్రులు, పాఠశాల భవనాలు, ఇళ్లు, ఇతర నిర్మాణాలను కూల్చివేసి ఇంకా కూల్చుతున్నాడు. ప్రజలకు ఆహారం, నీరు, వైద్య సదుపాయాలు అందనివ్వటం లేదు. ఐక్యరాజ్య సమితితోపాటు ఇతర దేశాలు పంపుతున్న ఆహారం, మందులు గాజాకు చేరకుండా గత 80 రోజులుగా పూర్తి బ్లాకేడ్ విధించాడు. యావత్ ప్రపంచం ఎంత ఖండించినా లెక్కించటం లేదు. నెతన్యాహును మన కాలపు మహా రాక్షసుడని, హిట్లర్ వారసుడని అనటం అందువల్లనే. దీనంతటి నేపథ్యపు చర్చలోకి వెళ్లే ముందు, ఇటీవలి వారం రోజుల పరిణామాల గురించి చెప్పుకోవాలి.నెతన్యాహూ చర్యలను ప్రపంచమంతా గతం నుంచి వ్యతిరేకిస్తుండగా, ఇజ్రాయెల్‌కు గట్టి మద్దతుదారులైన అమెరికా, యూరప్‌లలోనూ పునరాలోచనలు మొదలయ్యాయి. ఆ పాపాలను ఇక మోయలేకపోతున్నట్లున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గత కొద్ది వారాలుగా నెతన్యాహూ పట్ల విముఖంగా ఉన్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఇటీవల పశ్చిమాసియా పర్యటనకు వెళ్లిన ఆయన ఇజ్రాయెల్‌ను మాత్రం దాటవేసారు. ఈనెల 25 న మరొక అడుగు ముందుకు వెళ్లి, ఈ యుద్ధాన్ని ఇక ముగించాలని నెతన్యాహూను హెచ్చరించారు. యూరోపియన్ దేశాల వైఖరి, నిజమో నటనలో గాని అంతకన్న కఠినంగా మారుతున్నది. స్పెయిన్, నార్వే, ఐర్లండ్‌లు ఇప్పటికే పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించగా, బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలు తాము కూడా గుర్తించే ఆలోచన చేస్తున్నట్లు ప్రకటించాయి.

ఇదే విషయమై స్పెయిన్ చొరవ తీసుకుని 25న యూరోపియన్, అరబ్ దేశాల సమావేశాన్ని నిర్వహించింది. ఇజ్రాయెల్‌తో వాణిజ్య చర్చలను బ్రిటన్ అర్థంతరంగా నిలిపివేసింది. అదే నిర్ణయం తామంతా తీసుకోవాలంటూ నెదర్లాండ్ ఏర్పాటు చేసిన సమావేశంలో, 27లో 17 యూరోపియన్ దేశాలు ఆ తీర్మానాన్ని బలపరచాయి. పాలస్తీనా గుర్తింపును జూన్‌లో సౌదీ అరేబియాతో చర్చించనున్నట్లు ఫ్రాన్స్ ప్రకటించింది.యూరప్‌లో ఇజ్రాయెల్‌కు అన్నింటికన్న పెద్ద మద్దతుదారైన జర్మనీ సైతం నెతన్యాహూ ధోరణిని ఖండించింది.కాని ఇవేమీ లెక్కచేయని ఇజ్రాయెల్ ప్రధాని ఒక్కరోజైనా ఆపకుండా గాజాపై దాడులు జరిపిస్తూ, ప్రతి రోజూ కొన్ని డజన్ల మంది ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. పైగా, ఇటువంటి అమానుషం తగదంటున్నందుకు యూరోపియన్ నాయకులపై ఎదురు విమర్శలు సాగిస్తున్నాడు. వారు హమాస్ సమర్థకులని, ఆసంస్థ "దుర్మార్గాలను" సమర్థిస్తున్నారని నిందిస్తున్నాడు. అదే సమయంలో తన పథకం ఏమిటో దాపరికం లేకుండా ప్రకటిస్తున్నాడు. దాని ప్రకారం, పాలస్తీనా దేశాన్ని ఎప్పటికీ ఏర్పడన్విడు. ఆ మాట తన జీవిత చరిత్రలో ఎప్పుడో రాసాడు. గాజాలోని 20 లక్షలకు పైగా ప్రజలందరినీ నిర్మూలిస్తాడు, లేదా ఇతర దేశాలకు వెళ్లగొడతాడు. ఆ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుంటాడు. అక్కడ యూదులను సెటిల్ చేస్తాడు. మరొకవైపు వెస్ట్ బ్యాంక్ అసలు పాలస్తీనాయే కాదని, ఇజ్రాయెల్‌లో భాగమని ఎప్పుడో ప్రకటించినందున, ఆ మేరకు అక్కడ వేలాదిగా యూదులను సెటిల్ చేయటం సంవత్సరాల క్రితమే మొదలైంది.ఆ చర్య అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఐక్యరాజ్య సమితితో పాటు పలు పాశ్చాత్య దేశాలు విమర్శించినా లెక్క చేయటం లేదు. అక్కడి పాలస్తీనియన్లపై యూదు సెటిలర్లు తమ సైన్యం సహాయంగా సాగిస్తున్న అత్యాచారాలు, హత్యలు, భూఆక్రమణలు నిత్యకృతమైపోయాయి. అక్కడ నామమాత్రంగా గల పాలస్తీనా అథారిటీ ప్రభుత్వంపై పూర్తి నియంత్రణ ఇజ్రాయెల్‌దే. అందుకే ఆ ప్రభుత్వం గాజా దురంతాలపై అసలు నోరెత్తటం లేదు. తక్కిన ప్రపంచంతో పాటు ఇపుడు పాశ్చాత్య దేశాలు ఖండిస్తున్నా మాట్లాడటం లేదంటే, యాసిర్ అరాఫాత్ వారసులుగా అధికారానికి వచ్చిన వారు కేవలం అధికారం, ధనార్జన కోసం ఎంతగా పతనమయారో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ ఒక కొత్త విశేషం కూడా కనిపిస్తున్నది. ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత ఇజ్రాయెల్‌ను సమర్థించే అమెరికా విధానాన్ని యథాతథంగా కొనసాగిస్తూనే తన వ్యాపార ధోరణిలో అందుకొక కొత్త రంగు తెచ్చారు. అది, పాలస్తీనియన్లను గాజా నుంచి ఇతర దేశాలకు తరలించి అక్కడ అమెరికా ఆధ్వర్యంలో "అందమైన రిసార్ట్"ను అభివృద్ధి పరచగలమని. ఈ విషయం తెలిసిందే.

కాని అరబ్ దేశాల నుంచి, తక్కిన ప్రపంచం నుంచి తీవ్ర విమర్శలు రావటంతో వెనుకకు తగ్గటం కూడా తెలిసిందే. ఇటీవల ఆయన మాట మాట్లాడటం లేదు. కాని, తెర వెనుక నుంచి తన ఆమోదం ఉన్నదో లేక అదే ఆలోచనను తన అజెండా పైకి తెచ్చుకునో తెలియదు గాని, రిసార్ట్ మాటను నెతన్యాహూ ప్రకటిస్తున్నాడు. గాజా ప్రజలను ఇతర దేశాలకు తరలించేందుకు ట్రంప్ మొదట కొన్ని దేశాలతో సంప్రదించగా ఎవరూ అంగీకరించలేదు. అమెరికా అధ్యక్షుని ప్రయత్నాలే విఫలమైనపుడు ఇజ్రాయెల్ ప్రధాని సఫలంకాగల అవకాశం ఎంతమాత్రం ఉండదు. ఇది గ్రహించలేని వాడు కాదాయన. అయినప్పటికీ, ఒకవైపు హత్యాకాండ సాగిస్తూ మరొక వైపు అందుకు భీతిల్లి గాజా ప్రజలు తమంత తాము ఇతర దేశాలకు పారిపోగలరని ఆశిస్తున్నాడు. కాని తాజాగా ట్రంప్ వైఖరిలో ఒక మేర మార్పు, యూరప్‌లో పెరుగుతున్న తీవ్ర వ్యతిరేకతతో ఏమి జరగవచ్చునో చూడవలసి ఉంది. పాలస్తీనాకు సంబంధించి ప్రపంచమంతా మొదటి నుంచి గుర్తించి ఇపుడు యూరప్ కూడా క్రమంగా గుర్తిస్తున్న విషయం ఒకటున్నది. అది, పాలస్తీనా, ఇజ్రాయెల్ అనే రెండు స్వతంత్ర దేశాల ఏర్పాటు, అందుకు ఇరువురి రాజీ మినహా సమస్యకు వేరే పరిష్కారం లేదు, ఎప్పటికీ ఉండబోదన్నది.ఈ సూత్రాన్ని అందరూ గుర్తించి వ్యవహరించి నట్లయితే ఈ సమస్య కొనసాగేది కాదు. కాని ససేమిరా అంటూ వస్తున్నది ఇజ్రాయెల్. ఆ వైఖరికి మద్దతు ఇచ్చే పాశ్చాత్య దేశాలు, ఈ స్థితిని మన కాలపు మహా రాక్షసుడు తన చర్యల ద్వారా పరాకాష్ఠకు తీసుకు వెళుతున్నాడు.

# ముంబై మహాన్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ ముందంజ









మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ సత్తాచాటింది. తాము మనసు పెట్టి ఆడితే ఎంతటి ప్రత్యర్థి అయినా బలాదూర్ అంటూ చేతల్లో చూపెట్టింది. కీలకమైన ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపిస్తూ ముంబై క్వాలిఫర్-2లోకి దూసుకెళ్లింది. రోహిత్‌శర్మ ధనాధన్ అర్ధసెంచరీకి తోడు బెయిర్‌స్టో, సూర్యకుమార్ మెరుపులతో భారీ స్కోరు అందుకున్న ముంబై..గుజరాత్‌ను కట్టడి చేయడంలో సఫలమైంది. లక్ష్యఛేదనలో సాయి సుదర్శన్ సూపర్ అర్ధసెంచరీతో ఒంటరిపోరాటం చేసినా జట్టు గెలుపు తీరాలకు చేరలేకపోయింది. సమిష్టి బౌలింగ్‌తో గుజరాత్ నడ్డివిరుస్తూ ముంబై విజయకేతనం ఎగురవేసింది.ముల్లాన్‌పూర్: ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ ముందంజ వేయగా, గుజరాత్ టైటన్స్ తమ పోరాటాన్ని ముగించింది. శుక్రవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబై 20 పరుగుల తేడాతో గుజరాత్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. తొలుత రోహిత్‌శర్మ(50 బంతుల్లో 81, 9ఫోర్లు, 4సిక్సులు) అర్ధసెంచరీతో కదంతొక్కగా, బెయిర్‌స్టో(47), సూర్యకుమార్(33), తిలక్‌శర్మ(25) రాణించడంతో ముంబై 20 ఓవర్లలో 228/5 స్కోరు చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ(2/53), సాయికిషోర్(2/42) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 208/6 స్కోరుకు పరిమితమైంది. సాయి సుదర్శన్(49 బంతుల్లో 80, 10ఫోర్లు, సిక్స్) ఒంటరిపోరాటం చేయగా, సుందర్(48) ఆకట్టుకున్నాడు. బౌల్ట్ (2/56) రెండు వికెట్లు తీయగా, బుమ్రా, గ్లీసన్, సాంట్నర్, అశ్వని ఒక్కో వికెట్ తీశారు.

నిర్దేశిత లక్ష్యఛేదనలో గుజరాత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(1)ను బౌల్ట్ తన తొలి ఓవర్‌లోనే వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. బౌల్ట్ స్వింగ్‌ను సరిగ్గా అర్థం చేసుకోని గిల్ తన ఔట్‌పై డీఆర్‌ఎస్‌కు వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన కుశాల్ మెండిస్(20)..సాయి సుదర్శన్‌కు చక్కని సహకారం అందించాడు. ముంబై బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ వీరిద్దరు స్కోరుబోర్డుకు కీలకపరుగులు జతచేయడంతో పవర్‌ప్లే ముగిసే సరికి గుజరాత్ 66 పరుగులు చేసింది. లీగ్‌లో సూపర్‌ఫామ్‌మీదున్న సుదర్శన్ ముంబైపై తన తఢాకా చూపెట్టాడు. ఏ బౌలర్‌ను విడిచిపెట్టని సుదర్శన్ మరోమారు అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. కుశాల్ ఔటైనా..సుందర్‌తో కలిసి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరు ముంబై బౌలర్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటూ లక్ష్యం వైపు సాఫీగా సాగారు. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన బుమ్రా..సుందర్‌ను ఔట్ చేయడంతో మ్యాచ్ స్వరూపం మారిపోయింది. ఆ తర్వాత స్వీప్ షాట్ ఆడబోయిన సుదర్శన్ వికెట్ ఇచ్చుకోగా, రూథర్‌ఫర్డ్(24), తెవాటియా(16 నాటౌట్), షారుఖ్‌ఖాన్(13) స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయారు. ఆఖరి ఓవర్‌లో గుజరాత్ విజయానికి 24 పరుగులు అవసరమైన స్థితిలో 3 పరుగులే చేసి ఓటమి వైపు నిలిచింది.

గుజరాత్‌తో ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా టాస్ గెలిచిన వెంటనే బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించి బౌలింగ్‌తో కట్టుదిట్టం చేస్తామన్న ఉద్దేశంతో ముంబై ముందుకు సాగింది. కెప్టెన్ అంచనాలకు తగ్గట్టు గానే ఓపెనర్లు రోహిత్‌శర్మ, జానీ బెయిర్‌స్టో జట్టుకు మెరుగైన శుభారంభాన్ని అందించారు. గత కొన్ని మ్యాచ్‌ల నుంచి బౌలింగ్‌లో తీవ్రంగా తడబడుతున్న గుజరాత్..ముంబైతో పోరులోనే అదే ఒరవడి కొనసాగించింది. దీనికి తోడు పేలవ ఫీల్డింగ్‌తో ఆ జట్టు ఆదిలోనే మూల్యం చెల్లించుకుంది. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో 3 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రోహిత్‌శర్మ కొట్టిన షాట్‌ను బౌండరీ వద్ద కొట్జె విడిచిపెట్టడంతో బతికిపోయాడు. సిరాజ్ వేసిన మరుసటి ఓవర్‌లోనూ రోహిత్‌కు లైఫ్ దక్కింది. 12 పరుగుల వద్ద రోహిత్ ఇచ్చిన క్యాచ్‌ను వికెట్‌కీపర్ కుశాల్ మెండిస్ విడిచిపెట్టడంతో ముంబై ఊపిరి పీల్చుకుంది. ప్రసిద్ధ్ 4వ ఓవర్‌లో బెయిర్‌స్టో మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 26 పరుగులు పిండుకున్నాడు. రికల్టన్ స్థానంలో జట్టులోకి వచ్చిన బెయిర్‌స్టో తన విలువ చాటుకున్నాడు.బౌలింగ్ మార్పుగా వచ్చిన సాయికిషోర్‌ను రోహిత్ 6, 4, 6 కొట్టడంతో 14 పరుగులు వచ్చాయి. దీంతో ప్లేఆఫ్స్ ముగిసేసరికి ముంబై 79 పరుగులు చేసింది. సాయికిషోర్ 8వ ఓవర్‌లో షాట్ ఆడబోయిన బెయిర్‌స్టో..కొట్జె క్యాచ్‌తో తొలి వికెట్‌గా వెనుదిరగడంతో తొలి వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్(33)..రోహిత్‌కు జత కలిశాడు. ఈ క్రమంలో రషీద్‌ఖాన్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో రోహిత్ ఐపీఎల్‌లో 7వేల పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. ఫోర్‌తో అర్ధసెంచరీ మార్ అందుకున్న రోహిత్ బౌండరీలతో ఆకట్టుకున్నాడు. 12వ ఓవర్‌లో సూర్యకుమార్ 25 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను మెండిస్ విడిచిపెట్టాడు. సాయికిషోర్ బౌలింగ్‌లో సూర్యకుమార్ ఔటైనా 14 ఓవర్లు ముగిసే సరికి ముంబై 150 పరుగుల మార్క్ అందుకుంది. ఈ జోరు చూస్తే ముంబైకు భారీ స్కోరు సాధ్యమనుకున్న తరుణంలో రోహిత్ ఔటయ్యాడు. తిలక్‌వర్మ(25) ఎక్కువసేపు క్రీజులో నిలదొక్కుకోలేకపోయాడు. 19వ ఓవర్‌లో 200 మార్క్ అందుకున్న ముంబైకి కొట్జె వేసిన 20వ ఓవర్‌లో హార్దిక్ మూడు సిక్స్‌లతో 228 స్కోరు చేరుకుంది.

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో(రోహిత్ 81, బెయిర్‌స్టో 47, సాయికిషోర్ 2/42, ప్రసిద్ధ్ కృష్ణ 2/53), గుజరాత్: 20 ఓవర్లలో 208/6(సాయిసుదర్శన్ 80, సుందర్ 48, బౌల్ట్ 2/56, సాంట్నర్ 1/10)

ఒక ఎడిషన్‌లో 750కి పైగా పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా సాయి సుదర్శన్(759) నిలిచాడు. కోహ్లీ(973), గిల్(890), బట్లర్(863), వార్నర్(848) ముందు వరుసలో ఉన్నారు.

2015 నుంచి ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో 12 మ్యాచ్‌లాడిన ముంబై 10 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది.

# వరి పొలాల్లో ఉపయోగపడే పనిముట్లు..!












1. వరి పొలాల్లో దమ్ము చేయడం: ముందుగా రెక్కనాగలితో పొలాన్ని లోతుకు దున్ని ఎండకు ఎండబెట్టడం వలన మట్టి అడుగు భాగంలో ఉన్న చీడపీడల అవశేషాలు బయటపడి ఎండకు నశిస్తాయి. అదే కాక తుంగ వంటి కలుపు మొక్కల గడ్డలతో పాటు సమూలంగా బయటపడి నాశనమవుతాయి. ఇలా దుక్కి దున్నిన పొలంలో వరినాటు వేయడానికి ముందు నీటిని సుమారు 10 సెం.మీ. వరకు నిలిపి బాగా దమ్ము చేయాలి. దమ్ము ముఖ్య ఉద్దేశ్యము : నీటి సమ్మేళనంతో మట్టిని చిలికి తద్వారా నీటి అడుగు భాగంలో ఒండ్రుమట్టి పొరను ఏర్పరిచి, పై నిల్వ ఉంచిన నీరు లోపలి పొరల్లో ఇంకి పోకుండా చేయడం ఇందుకు ప్రత్యేకమైన నాగళ్లను మాత్రమే వాడాలి. దమ్ము చేయడానికి వాడవలసిన పరికరాలు :

**ఎ) ఎ.పి.ఏ.యు పడ్లరు :**

ఎడ్లతో సేద్యంచేసే రైతులకోసం ప్రత్యేకించి నిర్మించిన పరికరం. వరి నారుని ప్రధాన పొలంలోకి మార్చినప్పటినుండి (నాట్లు వేసినప్పటినుండి) 5-10 సెం. మీటర్ల నీటిని నిల్వ ఉంచి వరి పైరును సాగుచేయడం పరిపాటి. కాకపోతే ఈ నీటి నిల్వను తగ్గకుండా కాపాడేందుకు మరియు నాట్ల సమయంలో మొక్క వేళ్ళు ఇమడడానికి మెత్తటి భూమిని పొందుపరిచేందుకు "వరిదమ్ము" చాలా అవసరం అనగా ఇలా దమ్ము చేయు గలిగిన దానికై ప్రత్యేకంగా రూపొందించిన ఎ.పి.ఎ.యు. వడ్లరును వాడి అనుకున్న విధంగా వరిదమ్మును చేయగలదు. ఈ విధంగా ఎ.పి.ఎ.యు పడ్లరుతో దమ్ము చేయడం వలన నేల అడుగు భాగంలో ఒక గట్టి మట్టి పొర ఏర్పడి నీటిని లోపలి పొరలలోకి పోకుండా చేసి తద్వారా ప్రధాన పొలంలో పెట్టే సాగునీటి మొత్తాన్ని సుమారు 30-40 శాతం ఆదా చేయవచ్చు. ఎ.పి.ఎ.యు పడ్లరు ఖరీదు రూ.2,800/-,

**బి. విష్ణు పడ్లరు :**

దీనిని ట్రాక్టరుకు తగిలించుకొని వరి పొలంలో దమ్ము చేయడానికి ప్రత్యేకంగా "ఆంధ్రప్రదేశ్ నీటి యాజమాన్య పథకము", తిరుపతి వారు రూపొందించారు. ఈ యంత్రాన్ని నీటిని నిల్వ ఉంచిన పొలంలో దమ్మును సమర్థవంతంగా చేయవచ్చును. ఈ యంత్రంలో 36 లేదా 40 కర్రలు కలిగి ముందుకు లాగడం వలన మధ్యలో అమర్చబడిన షాఫ్ట్ తిరిగి, దానితో పాటు అమర్చిన పలకలు లేదా తెడ్డును త్రిప్పుతుంది. ఇలా త్రిప్పేప్పుడు మట్టి ముద్దలను పైకి క్రిందకు కలియత్రిప్పి చిలకడం వలన దమ్ము నాణ్యత పెంపొందిస్తుంది, ఇలా దమ్ము చేసిన పొలాన్ని పలక సహాయంతో చదును చేసి 12-24 గంటలు కదపకుండా ఉంచి ఆపై పొలంలో నాట్లను వేసుకోవాలి. ఇలా చేయడంవలన వరి నాట్లకు కావలసిన మెత్తటి పొర ఏర్పడుతుంది. అంతేకాక వరి సాగులో సాగునీటి ఆదా 40 శాతం వరకు మరియు దమ్ముచేసే సమయము 50 శాతం వరకు తగ్గించవచ్చునని పరిశోధనాపూర్వకంగా నిరూపించబడిరది. దీని ఖరీదు రూ.18,000/- నుంచి 22,000/- వరకు ఉంటుంది.

**సి. రోటోవేటర్:**

రోటోవేటరు మెట్ట సేద్యంలోనే కాక వారిదమ్ము చేయడానికి సమర్థవంతంగా వాడవచ్చును. ఇది ముందు వివరించిన విధంగా ట్రాక్టరు/పవర్ టిల్లర్ యొక్క పి.టి.ఓ. షాఫ్ట్ ద్వారా నడుపబడే యంత్రము దీనికి అమర్చబడిన ఒంపు కర్రల పి.టి.ఒ ద్వారా అందిన శక్తితో వేగంగా తిరిగి తిప్పి మట్టిగడ్డలను నూర్చి నీటిలో చిలకరిస్తుంది. ఇలా చేయడం వలన వరినాట్లుకు కావలసిన దమ్ము నాణ్యత పెరిగి నీటిని వేలలోపలికి ఇంకి పోకుండా పూర్తిగా అరికడుతుంది. అంతేకాక ఈ రోటోవేటర్ను వాడే పక్షంలో దుక్కిని నాగలితో దున్నే అవసరం కూడా ఉండదు. కాకపోతే నీటిని నిల్వ ఉంచిన పొలంలో రోటోవేటర్ సహయంతో ట్రాక్టర్/పవర్ టిల్లర్ మొదటి గేరులో అంటే అతి తక్కువ వేగంలో దమ్ము మొదలు పెట్టాలి. ఆ తరువాత వేగం పెంచి దమ్ము నాణ్యతను పెంచవచ్చు. ఇలా చేయడం మూలంగా మామూలు వద్దతితో పోలిస్తే 60 శాతము సమయాన్ని, 40 శాతము సాగునీటిని తగ్గించి, నాణ్యమైన దమ్మును పొందవచ్చును. దీని ఖరీదు రూ? 1,00,000 వరకు ఉంటుంది.

**డి. పళ్ళెపు దంతి:**

ఈ పళ్ళెపు దంతిని మెట్ట సేద్యంలోనే కాక, వరిపొలాల్లో దమ్ము చేయడానికి కూడా సమర్థవంతంగా వాడవచ్చును. కాకపోతే, ఈ పళ్ళెపు దంతులలో సింగిల్ యాక్షన్ డిస్క్ హారో (ఒకే వరుసలో అమర్చబడిన పళ్ళాల దంతి) ని మాత్రమే దమ్మును చేయడానికి వాడవలెను. ఇలా అడుసు పొలంలో దమ్ము చేసిన తరువాత చదును చేసే పలకను వాడి నేల ఉపరితలాన్ని చదును చేయడం వరి పంట నీటి యాజమాన్యంలో చాలా ముఖ్యమైన పని. ఈ పరికరం ద్వారా సాగు నీటిని 20% వరకు ఆదా చేయవచ్చునని నిరూపించబడినది. పళ్ళెపు దంతి ఖరీదు రూ.30,000/-,

**2. పచ్చిరొట్టె ఎరువును కలిపే ట్రాంప్లర్ :**

రైతాంగం వరి పొలంలో నేల స్వభావాన్ని బట్టి పోషకాలు మరియు మట్టి భౌతిక పరిమాణాలను మెరుగు పరిచేందుకు జనుము లేదా జీలుగలను (లేదా) రైతుకు అందుబాటులో ఉన్న ఇతర పచ్చిరొట్టె ఎరువును కలుపడం పరిపాటి. ఈ పచ్చిరొట్టి ఎరువుకై పండిరచే నేలలో కలిపేందుకు దున్ని పొలంలో నీటిని నిల్వ ఉంచి ఈ ట్రాంప్లర్ను వాడాలి. దీనిలో ఎడ్ల సహాయంతో నడిపేవి మరియు ట్రాక్టరు సహాయంతో నడిపేవి విడి విడిగా రూపొందించబడిరది. ఈ ట్రాంప్లర్కు అమర్చిన పొడవాటి కత్తులు (బ్లేడ్స్), పరికరాన్ని లాగినపుడు నేలపై పరచబడిన పచ్చి ఆకును కత్తిరించి మట్టిలోపలకు త్రొక్కుతూ మట్టిని కొంతవరకు తిరగ తిప్పుతుంది. ఇలా ట్రాంప్టర్ను వాడి పచ్చిరొట్టె ఎరువును తొందరగా మట్టిలోకి కలపడమేకాక సమర్థవంతంగా కుళ్ళిందుకు గం దీని ఆకార నిర్మాణాలను చూసి పొరపాటుతో పరి దమ్ముకు చేసే యంత్రంగా వాడడం ఏ మాత్రం ఉపయోగకరం కాదు..

**3. ఎ. వరి డ్రమ్ సీడరు :**

దీని ద్వారా " ఒకే సారి ఎనిమిది వరుసలలో సాళ్ళమధ్య 20 లేదా 25 సెం.మీటర్ల దూరంలో విత్తేందుకు వీలవుతుంది. మనము నాటాలనుకున్న వరి విత్తినాన్ని 24 గంటలు నానబెట్టి 12 గం? మండె కట్టి, గింజల నుండి మొలక ఆరంభదశలో పరికరానికి అమర్చిన నాలుగు డబ్బాలలో నింపాలి. ఇలా డబ్బాలను 3/4 వరకు నింపి, పరికరాన్ని ముందుగా దమ్ముచేసి చదును చేసిన పొలంలో చక్రాల సహాయంతో పరికరానికి అమర్చిన, చేతిపిడి సహాయంతో లాగడం వలన చక్రాలు తిరిగి డబ్బాలు తిరిగి, డబ్బాలకున్న రంధ్రాల ద్వారా పొలంలో వరుసగా పడుతుంది. ఈ వరుసలు పొడవకుండా పొలంలో వారం వరకు పలుచటి నీరు మాత్రమే పెట్టాలి. డ్రమ్ సీడరును లాగడానికి ఒకరు, ఒకరు విత్తనం అందించడానికి అవసరము కావడం వలన వరి నాటే ఖర్చు బాగా తగ్గి సుమారు రూ.1500/- నుండి రూ.2000/- వరకు ఆదా చేయవచ్చునని పరిశోధనల ద్వారా నిరూపించబడిరది. ఈ డ్రమ్ సీడరును ఉపయోగించి రోజుకు 2-3 ఎకరాల వరి నాటవచ్చును.

**బి. వరి నాటే యంత్రాలు :**

ఈ పద్ధతిలో ప్లాస్టిక్ ట్రేలు సుమారు 600 గ్రా?ల మట్టిని నింపి ఆపై విత్తనాన్ని పరచి ఆపై మట్టి మరియు ఎక్కువ పశువుల ఎరువు లేదా వర్మికంపోస్టు వేయడం ఆపై నీరు చిలకరించడం వరకు ఒకే కన్వేయర్ యంత్రం ద్వారా నిర్వర్తించవచ్చును. ఇలాంటి 80 ట్రేలు ఒక ఎకరా పొలానికి కావల్సివుంటుంది. ఈ ట్రేలను పొలంలో ఒక మూలన పలుచటి నీటిని కట్టి దాంట్లో వుంచి 15 నుంచి 25 రోజులు పెంచి నారును యంత్రం ద్వారా సమర్థవంతంగా నాటవచ్చును. నారు నాటేందుకు ముందు పొలాన్ని బాగా దమ్ము చేసి, చదును చేసుకోవడం చాలా ముఖ్యం అంతేకాక పొలాన్ని ఆరబెట్టాలి. నాటే ముందు పలుచగా నీరు పెట్టడం వల్ల వరి నారు నాటే యంత్రం సులువుగా నడిపేందుకు ఈ యంత్రం ద్వారా నాటినపుడు 8 సాళ్ళలో ఒకే మారు నాటడం జరుగుతుంది. ఈ యంత్రం ద్వారా రోజుకు 2-6 ఎకరములు వరినాట్లను వేయవచ్చును. వ్యవసాయ కూలీలు ఖర్చు సుమారు 45 శాతం తగ్గుతుంది. దీని ఖరీదు రూ. 2,75,000/- నుండి రూ. 18,00,000/- వరకు ఉంటుంది.

# తాటి పండు ఆవశ్యకత మరియు విలువ ఆధారిత ఆహార పదార్థాలు..!



గ్రామీణ భారతంలో తాటి చెట్టు అత్యంత ప్రాధాన్యత గలది. తాటి చెట్టు భాగాలలో పనికి రానిది ఏదీ లేదు. మన దేశంలో తీరప్రాంత రాష్ట్రాల్కైన గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, గోవా, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా మరియు బెంగాల్లో తాటి చెట్లు అధికంగా ఉన్నాయి. ఇవి భారతదేశంలో సుమారు 15 కోట్లు ఉన్నట్లు అంచనా. అందులో అధికంగా తమిళనాడులో ఆ తరువాత ఆంధ్ర ప్రదేశ్లో ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్లో సుమారు 3 కోట్లు తాటి చెట్లు ఉన్నాయని అంచనా. చక్కెర నిచ్చు చెట్లలో తాటి, ఖర్జురా, కొబ్బరి మరియు జీరిక ముఖ్యమైనవి. వీటిలో తాటిలో ఎక్కువ చక్కెర ఉంటుంది. ఈ చెట్లు సహజ సిద్ధముగా పెరిగి విరివిగా లభించును. అందువల్ల చాలా ప్రాముఖ్యత కలదు.తాటిలోని అన్ని భాగాలు ఉపయోగకరమైనవి. దాదాపు 800 పైగా ఉపయోగాలు ఉన్నాయని అంచనా. ఇందులో ముఖ్యమైనవి ఎనీరా, ముంజెలు, పండ్లు, తేగలు మరియు బుర్రముంజె తినేవాటిలో ముఖ్యమైనవి. వీటితోపాటు వివిధ భాగాలనుండి అనేక రకాల్కైన పీచు లభించును. వీటిలో ఆడచెట్ల నుండి మాత్రమి లభించు పండ్లు ఆగష్టు నుండి అక్టోబరు వరకు చాలా విరివిగా లభించును.తాటి పండ్లు బాగా పక్వానికి వచ్చిన తరువాత వటికవే రాలుతాయి. సరాసరి ఒకచెట్టు నుండి 250 పండ్లు లభించును. తాటి పండులో 1 నుండి 3 టెంకలు ఉంటాయి. 74 % పండ్లలో మూడు టెంకలు ఉంటాయి. రెండు టెంకలు గల పండ్లు 18% ఉంటాయి. మిగిలిన 8% ఒక టెంకను కలిగి ఉంటాయి. తాటి పండులో గుజ్జు 11 శాతం, పీచు 13.5 శాతం మరియు టెంకలు 67.5 శాతంతో పాటు పైతొక్క 8 శాతముంటుంది. ఒక్కొక్క పండులో సుమారు 300 గ్రా. గుజ్జు లభించును. తద్వారా ఒక చెట్టు నుండి 75 కిలో గుజ్జు లభించును. ఆంధ్రప్రదేశ్లో గల 1.5 కోట్ల ఆడ చెట్ల నుండి ఒక కోటి మెట్రిక్ టన్నుల గుజ్జు లభ్యత కలదు. ప్రస్తుతం ఒక శాతం గుజ్జు కూడా వినియోగంలో లేదు, చాలా తక్కువ పరిమాణంలో ఇళ్ళలో తాటి ఇడ్లి, రొట్టె చేసుకొంటారు. ఈ గుజ్జును ఉపయోగించి పరిశ్రమ పెట్టుటకు చాలా అవకాశలు కలవు.

**తాటి గుజ్జు లోని పోషక విలువలు :** తాటి గుజ్జు దాదాపు 78 % తేమ మరియు 15 % చక్కెరలు కలిగి ఉంటుంది. మాంసకృత్తులు 3 %, పీచు పదార్ధము 1.7 % తో పాటు ఖనిజ లవణాలు 4.4 % మరియు 100 గ్రా.లలో 3.2 మి.గ్రా. బీటా కెరోటిన్ను కలిగి ఉండును. వీటితో పాటు "సి" విటమిన్ మరియు అనేక పోషక విలువలు సమృద్ధిగా ఉండును. మామిడి పండ్ల కంటే అధికంగా పోషక విలువలు కలిగి ఉంటుంది.సాధారణంగా తాటి గుజ్జు లభించే సమయంలో సేకరించి చాపల మీద సన్నని పొరలగ వేసి ఎండలో ఆరబెట్టి తాండ్ర తయారు చేస్తారు మరియు ఈ తాటి పండ్ల గుజ్జును నేరుగా గాని, విరి పిండి గోధుమ పిండిలో కలిపి వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేయవచ్చు.

తాటి పండును వేడి నీటిలో పది నిమిషాలు ఉంచడం ద్వారా సులభంగా గుజ్జును వేరు చేయవచ్చు మరియు సహజంగా తాటిలో గల కొంచెం చేదును తొలగించవచ్చును, చేదును ఆవిరిలో ఉడికించండం ద్వారా కుడా చేదును పుర్తిగా తొలగించవచ్చును.

**తాటి గుజ్జు నుండి ఆహార పదార్థాలు :**

**శీతల పానీయం :**

తాటి గుజ్జుకు తగినంత పరిమాణంలో చక్కెర కలిపి 0.5% నిమ్మ ఉప్పును 0.1% సోడియం బెంజోయేట్ మరియు కావలసిన రంగును కలిపి తాజా పానీయమును చేసుకోవచ్చు. దీన్ని తగిన విధంగా నిల్వ ఉంచినచో రెండు నెలల వరకు నిల్వ ఉంచవచ్చు. తాటి గుజ్జును ఇతర పండ్ల గుజ్జుతో కలిపి వివిధ రకాల్కైన పానీయాలు తయారు చేయవచ్చు. ఇందులో పైనాపిల్, ద్రాక్ష, బత్తాయి వాడవచ్చు. తాటి గుజ్జులో మూడో వంతు ఇతర పండ్ల గుజ్జును తీసుకోవాలి.

**స్క్వాష్ :** తాటి గుజ్జుకు చిక్కబడిన చక్కెర ద్రావణాన్ని కలపడం ద్వారా స్క్వాష్ తయారు చేయవచ్చు. సుమారు 200 గ్రా. గుజ్జుకు 300 గ్రా. చక్కెర మరియు చిటికెడు నిమ్మ ఉప్పు మరియు సోడియం బెంజోయేట్ ఒక లీటరు నీరు అవసరం. దీన్ని పరిశుభ్రమైన సీసాల్లో కొంచెం ఖాళీ ఉంచి నింపడం ద్వారా నిల్వ ఉంచవచ్చును.


**జాము :** ఒక కె. జి. తాటి గుజ్జును అరగంట సేపు వేడిచేసి అర కిలో చక్కెర కలిపి 2 గ్రా. నిమ్మ ఉప్పును కలిపి చిక్కబడే వరకు మరగించడం ద్వారా జాము తయారు చేయవచ్చును. ఇందులో మొత్తం చెక్కర శాతము 68 బ్రిక్స్ ఉండును.

**తాటి తాండ్ర లేదా ఫ్రూట్ బార్ :** తాటి గుజ్జుకు తగినంత పరిమాణంలో చక్కెర కాని తాటి చక్కెర కాని కలిపి 0.5% నిమ్మ ఉప్పును 0.1% సోడియం బెంజోయేట్ కలిపి ఎండలో గాని వేడి గాలి యంత్రాలలో గాని, ఎండబెట్టడం ద్వారా తయారు చేయవచ్చు.

**చిక్కబడిన గుజ్జు :**

తాటి గుజ్జును 0.1% సోడియం బెంజోయేట్ కలిపి అరగంట సేపు వేడిచేసి పరిశుభ్రమైన సీసాలలో నింపడం ద్వారా నిల్వ ఉంచవచ్చును.తాటి గుజ్జును ఫోమింగ్ ఎజెంట్తో కలిపి ఎండబెట్టడం ద్వారా పిండి రూపంలోకి మార్చవచ్చును. దీన్ని ఉపయోగించి చాక్లెట్స్, బిస్కెట్స్ మరియు ఇతర అనేక రకాల్కైన ఆహార పదార్థాలు తయారు చేయవచ్చును.

# లక్షల్లో లాభాలు పొందాలనుకుంటున్నారా? అయితే ఇప్పుడే డెయిరీ ఫార్మ్ మొదలు పెట్టండి..!



వ్యవసాయ అనుబంధ రంగమైన పాడిపెంపకం.. రైతులకు భారీ ఆదాయం తెచ్చిపెడుతోంది. అయితే నిర్వహణపై అంతగా అవగాహన లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా పశువులకు అందించే దాణా విషయంలో వైఫల్యం పొందుతున్నారు. దీంతో పాటు మేలు జాతి పశువులు కాకుండా.. తక్కువ పాల దిగుబడినిచ్చే పశువులను ఎంపిక చేస్తున్నారు. కాబట్టి, డెయిరీ నిర్వహణలో ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలైన ఆదాయం పొందవచ్చు.మేతలో జాగ్రత్తలు: పశువుకు అందించే మేతపైనే పాల దిగుబడి ఆధారపడి ఉంటుంది. కాబట్టి, పప్పు ధాన్యాలతో పాటు పచ్చి, ఎండు గడ్డిని అందించే ప్రయత్నం చేయండి. ప్రతీ 2-2.5 లీటర్ల పాలకు రెండు కిలోల చొప్పున మేత అందించండి. అధిక ఖర్చయినా.. వీలైనంత వరకు మినరల్ మిక్చర్ పెట్టండి. జంతువులు ఇచ్చే పాల సామర్థ్యం ఆధారంగా మేత పెట్టాలి. ముఖ్యంగా గేదెలు, ఆవులకు ఇచ్చే మేతలో 60-65% పీచు పదార్థాలు, 30-40 దాణా ఉండేలా చూడాలి. పాలు పితకడానికి కనీసం రెండు గంటల ముందు నీరు, మేత ఇవ్వడం మేలు.

**పాలు పితకడంలో జాగ్రత్తలు**

పాలు పితికేటప్పుడు షెడ్ ను శుభ్రంగా ఉంచుకోవాలి.

పితకడానికి ముందు గేదె/ఆవు పొదుగు, చనులను గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి. గేదెకు చాఫ్ కట్టర్ తో కత్తిరించిన గడ్డిని మాత్రమే అందించాలి. పాలు పితికే వ్యక్తి చేతులకు ఎక్కువగా గోళ్లు ఉండకుండా. చూడాలి. శానిటైజర్ తో చేతులను శుభ్రం చేసుకోవాలి.

పాలు పితికే సమయంలో పొగ తాగడం, మద్యం సేవించి పిండొద్దు. తల వెంట్రుకలు చిన్నవిగా ఉండాలి.

పాలు పితికే పాత్రలు శుభ్రంగా ఉంచాలి. అపరిశుభ్రమైన పాత్రలు ఉపయోగిస్తే పాలు త్వరగా చెడిపోతాయి.

పాలు పిండే మొదటి ధారల్లో సూక్ష్మ క్రిములుంటాయి. కాబట్టి, వేరే పాత్ర లేదా నేలపై పిండాలి.

పాలు పిండిన తర్వాత చనులను అయోడిన్ ద్రావణంలో ముంచాలి. పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే పాల ఉష్ణోగ్రత తగ్గించాలి.

యంత్రంతో పాలు పితకడం: డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్న రైతులు, వ్యాపారస్తులు పాలు పితకడం కోసం యంత్రాలను ఉపయోగించడం ఉత్తమం. ఎందుకంటే అధిక పాల ఉత్పత్తి ఉన్న పశువుల్లో చేతి ద్వారా ఎక్కువ సేపు పాలు పితకాలంటే కష్టమవుతుంది. సాధారణంగా ఒక పశువులో పాలు పితకడం కేవలం 5-6 నిమిషాల్లోనే పూర్తి చేయాలి. ఇలా పితక్కపోతే కొన్ని పాలు పొదుగులోనే ఉండి, పొదుగు వాపు వ్యాధులకు దారితీస్తుంది. ఫలితంగా పాల ఉత్పత్తి తగ్గి రైతు నష్టపోతాడు. కానీ యంత్రం ఉపయోగించి పాలు పితికితే.. పాలను శుభ్రంగా తీయడంతో పాటు, వ్యాధులను దూరం చేయవచ్చు. దీంతోపాటు చనుల్లో పాలు పూర్తైన తర్వాత చనులకు తగిలించిన కప్పులు వాటికవే ఊడిపోతాయి. కాబట్టి, ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అయితే ఈ యంత్రాలన్నీ పశువులను ఎక్కువ పాలు ఇచ్చేలా ప్రేరేపిస్తాయి. కాబట్టి, అధిక పాల ఉత్పత్తి అవుతుంది.

దూడలతో ఆదాయం: డెయిరీ ఫామ్ తో లాభాలు ఎలా వస్తాయంటే దూడల ద్వారా అని ఇట్టే చెప్పేస్తారు. అవునండీ, పాలతో మాత్రమే లాభాలు వస్తాయనుకుంటే మీరు పొరబడినట్లే. ముఖ్యంగా నిర్వహణ కోసం మీరు తెచ్చుకునే గేదె ఆవు 10-15 రోజుల్లో ఈనే విధంగా ఉండాలి. అలాంటప్పుడే మీరు దూడ, పాలు.. రెండింటితో లాభాలు గడించవచ్చు. దూడను పెంచి, చూడి కట్టిన తర్వాత విక్రయిస్తే మీరు రెట్టింపు ధర పొందవచ్చు. అయితే మీరు విక్రయించే దూడ కూడా మంచి బ్రీడ్ అయి ఉండాలి. ఎక్కువ పాలు, అధిక వెన్న శాతం కలిగి ఉండాలి. సాధారణ దూడలు అయితే మాత్రం ఆశించిన ధర లభించకపోవచ్చు. ముఖ్యంగా మీ డెయిరీ ఫాంలోనే స్వయంగా కృత్రిమ గర్భధారణ చేయిస్తున్నట్లైతే మీరు నాణ్యమైన బ్రీడ్ ఎంపిక చేసుకోండి. ఈ విధంగా మీరు డెయిరీ ఫామ్ లాభాలు పొందవచ్చు.